

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 298 | శనివారం 07 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,



మురసు తుఫాన్లతో పంటలకు భారీ నష్టం

- పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ..
- ప్రతీ బాధితుడికి సాయం అందే వరకు పనిచేస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు

2లో

తుఫాన్ల నష్టంపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

గుంటూరు,ఛీఫ్ బ్యూరో నందిపత్రిక

అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో రాష్ట్రంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుంటూరు జిల్లా రేటూరు వద్ద రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. తుఫాన్ల వల్ల జరిగిన నష్టాన్ని, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరించారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను దెబ్బతీశాయని పేర్కొన్నారు. బాధిత రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల రాష్ట్రానికి పెద్ద ఎత్తున నష్టం జరిగిందని చంద్రబాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇప్పటికే గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. పట్టిసీమ ద్వారా నీటిని అందించడంతో రైతులు పంటలు సాగు చేశారని, మంచి దిగుబడులు వస్తున్న సమయంలో మురసు తుఫాన్ పంటలను దెబ్బతీసిందని వివరించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై మురసు తుఫాన్ తీవ్ర ప్రభావం చూపిందన్నారు. ప్రభుత్వం ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల చాలా వరకు నష్టాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని చంద్రబాబు సూచించారు. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా నష్టపోయిన పెట్టుబడిని రైతులు కొంతవరకు తిరిగి పొందవచ్చని తెలిపారు. తుఫాన్లకు సంబంధించి ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి నష్టాన్ని తగ్గించడంతో పాటు సహాయక చర్యలను వేగంగా చేపట్టగలిగామని చెప్పారు. తుఫాన్ సహాయక చర్యల కోసం తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా సహాయం

ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..



భారీ వర్షాలతో ఏపీ జలాశయాల్లోకి చేరిన కొత్త నీరు

మొత్తం 505.76 టీఎంసీలకు పెరిగిన నీటి నిల్వలు

ప్రధాన జలాశయాల్లో మిశ్రమంగా నీటిమట్టాలు 2లో

శ్రీశైలం, సోమశిల ప్రాజెక్టులలో ఇంకా తక్కువగానే నీరు

రాష్ట్రవ్యాప్తంగా 10.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జలాశయాల్లోకి కొత్తగా నీరు వచ్చి చేరింది. రాష్ట్ర జలవనరుల శాఖ గణాంకాల ప్రకారం, ప్రస్తుతం రిజర్వాయర్లలో మొత్తం 505.76 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇది జలాశయాల పూర్తి సామర్థ్యం 1,161.36 టీఎంసీలలో సుమారు 43.51 శాతానికి సమానం. వర్షాలు కొనసాగితే మరో 655.59 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందని అధికారులు తెలిపారు.నదీ బేసిన్ల వారీగా చూస్తే, కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులలో అత్యధికంగా 318.27 టీఎంసీలు (42.47% సామర్థ్యం), పెన్నా బేసిన్‌లో 107.74 టీఎంసీలు (36.47%), గోదావరి బేసిన్‌లో 20.51 టీఎంసీలు (76.72%) నిల్వ ఉన్నాయి.

రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు సిద్ధరామయ్య గైర్హాజరు!



హాసన్ జిల్లా పర్యటనకు వెళ్లిన రాహుల్ గాంధీ

మీటింగ్‌కు హాజరుకానున్న డీకే శివకుమార్ 2లో

ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!



కొత్త రాజకీయ పార్టీ స్థాపిస్తున్న విజయసాయిరెడ్డి

ఈ నెల 11న పార్టీ ఆవిర్భావం

పలుపురు నేతలు పార్టీలో చేరిక

రెండు కుటుంబాల పాలనకు ప్రత్యామ్నాయంగా వస్తున్నామన్న మాజీ ఎంపీ

జగన్ పామ్మునకుండా పాగబెట్టే బయటకు పంపించారని తీవ్ర ఆరోపణ 2లో

శాంతిపురం కేసులో టీడీపీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి భారీ ఊరట..



2లో

రైతుల సమస్యలపై 2021లో చేసిన ధర్నాకు సంబంధించిన కేసు

అమరనాథరెడ్డి సహా 29 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

చీరాల మున్సిపల్ ఎన్నికల్లో ఖాతా తెరిచిన కాంగ్రెస్

1, 21, 25, 33వ వార్డులను కైవసం చేసుకున్న హస్తం పార్టీ

మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్ ప్రభావమే కారణమంటున్న విశ్లేషకులు 2లో

పొలం గట్లపై చంద్రబాబు క్షేత్రస్థాయిలో రైతులకు అండ..



తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయి పర్యటన

నీట మునిగిన పాలాల్లో నడుస్తూ, పంట నష్టాన్ని స్వయంగా అంచనా

రాత్రి పగలు సమీక్షలు, టెలికాన్ఫరెన్సులతో యంత్రాంగాన్ని అప్రమత్తం

తుపాను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ, సహాయక చర్యల పర్యవేక్షణ 2లో

సచివాలయంలో సమీక్షలు, టెలికాన్ఫరెన్సులకే పరిమితం కాకుండా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా పొలం గట్లపైకి, పంట బోదెల మీదకు వెళ్లి తుపాను సృష్టించిన బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. రైతు కష్టం తెలిసిన నాయకుడిగా, అన్నదాతల కన్నీళ్లు తుడిచేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భారీ వర్షాలకు నీట మునిగి కళ్లెదుటే పంట నాశనమవుతుంటే గుండెలు బాదుకుంటున్న కర్షకులకు అండగా నిలిచారు. ధ్వంసమైన రహదారుల్లో, బురదమయమైన పొలాల్లో నడుస్తూ, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుపాను హెచ్చరికలు జారీ అయిన అక్టోబరు 27వ తేదీ నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తమయ్యారు. 'అర్నబ్', 'మురసు' తుపానుల సమయంలో రాత్రిళ్లు కూడా మేల్కొని కలెక్టర్లు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్సులు నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ముంపునకు గురయ్యే ప్రాంతాలు, ప్రజల తరలింపు, సహాయక చర్యల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించారు. రాష్ట్ర యంత్రాంగాన్ని సమన్వయం చేయడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన సహాయం కోసం కృషి చేశారు. ఒకవైపు ఉన్నతాధికారులతో సమీక్షలు, మరోవైపు క్షేత్రస్థాయి పర్యటనలతో విపత్తు నిర్వహణలో తనదైన మార్క్ చూపించారు. ఆయన ముందుచూపు, సత్వర స్పందన వల్ల



ఒకటి కాదు రెండు కాదు.. 70కి పైగా అవమానాలు భరించా!

రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి వైసీపీ అధినేత జగన్ పై మరోసారి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. తాను స్థాపిస్తున్న కొత్త పార్టీలో పలువురు నాయకులు చేరుతున్న సందర్భంగా విజయసాయిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ నుంచి తనను జగన్ అవమానించి బయటకు పంపించారని, పొమ్మనకుండా పొగబెట్టారని సంచలన ఆరోపణలు చేశారు.ఈ నెల 11వ తేదీన తన కొత్త పార్టీ ఆవిర్భావం ఉంటుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీలో చేరికలను స్వాగతించారు. విశ్వ హిందూ పరిషత్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సుమతి రెడ్డి, అనకాపల్లికి చెందిన హిందూ ఎస్సీ, ఎస్టీ కులాల పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోని గణేశ్ తమ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సుమతి రెడ్డి రాబోయే ఎన్నికల్లో తిరుపతి జిల్లా నుంచి శాసనసభకు పోటీ చేస్తారని, నియోజకవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ చేరికలు తమ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు సమన్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. "రాష్ట్రాన్ని రెండు కుటుంబాల చేతుల్లో పెట్టకూడదు. రాజ్యాంగబద్ధంగా ఎవరి హక్కులు వారికి దక్కాలి. యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అంతర్గత ప్రజాస్వామ్యంతో మా పార్టీ నడుస్తుంది" అని ఆయన వివరించారు.

జగన్ నన్ను బయటకు గెంటేశారు వైసీపీ నుంచి బయటకు రావడానికి గల కారణాలను వివరిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "నేను పార్టీని వదిలి వెళ్ళలేదు, నన్ను బయటకు తోసేశారు. పొమ్మనకుండా పొగబెట్టి, అప్పుడప్పుడు అవమానించి, ఒక మనిషిగా భరించలేనటువంటి పరిస్థితులు కల్పించారు. అందుకే ఆ పార్టీని వీడాల్సి వచ్చింది. స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు నన్నెప్పుడూ అవమానించలేదు. కానీ జగన్ పాలనలోనే ఇది జరిగింది. చెప్పుడు మాటలు విని నన్ను దూరం పెట్టారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకటి రెండు కాదు, 70కి పైగా అవమానాలను భరించానని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే పనులు చేస్తే ఎవరైనా ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు. "ప్రతి మనిషికీ ఆత్మగౌరవం ఉంటుంది. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినప్పుడు ఇక అక్కడ ఉండలేకపోయాను. కూర్చున్న కొమ్మను నరికేసినప్పుడు ఇంకేం చేయగలం? అందుకే బయటకు వచ్చాను" అని అన్నారు.

హిందూత్వ ముద్రపై స్పందన పార్టీలో కాషాయ రంగు ప్రభావం ఎక్కువ అంటున్నారనే విమర్శపై విజయసాయిరెడ్డి స్పందిస్తూ, "మనం భారతమాత బిడ్డలం. మన అమ్మ గురించి మనం గొప్పగా చెప్పుకుంటాం. అలాగని ఇతరులను ద్వేషించం. భారతదేశంలోని ప్రతి క్రిస్టియన్, ముస్లిం వెనుక భారతీయ డీఎన్ఏ ఉంది. ఇది నిరూపితమైన సత్యం. మేము హిందూ ధర్మం గురించి మాట్లాడితే ఇతరులకు వ్యతిరేకం కాదు. అందరికీ సమన్యాయం చేయడమే మా పార్టీ ఉద్దేశం," అని స్పష్టం చేశారు.

అధికారంలో ఉన్నామని విర్రవీగితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏకపక్ష వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ఆయన విమర్శించారు. తాము పెట్టబోయే పార్టీలో ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూసుకుంటామని, ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చే మూడో ప్రత్యామ్నాయంగా తమ పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మురసు తుఫాన్లతో పంటలకు భారీ నష్టం

తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

30 వేల విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ అర్నబ్ తుఫాన్ కారణంగా నేలకొరిగిన 30 వేల విద్యుత్ స్తంభాలను తిరిగి పునరుద్ధరించగలిగామని ముఖ్యమంత్రి తెలిపారు. మురసు తుఫాన్ వల్ల మరో 10 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. అర్నబ్, మురసు తుఫాన్ల వల్ల సంభవించిన నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నామని తెలిపారు. తుఫాన్ల ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా తుఫాన్ ప్రభావంపై వివరాలు అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు.

చివరి బాధితుడికి సాయం అందే వరకు పనిచేస్తాం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చివరి వ్యక్తికి కూడా సహాయం అందే వరకు ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. నల్లమడ డ్రైన్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున విధ్వంసం జరిగిందని విమర్శించారు. గతంలో తుఫాన్లు వచ్చినప్పుడు రెడ్ కార్పెట్ వేయించుకుని పర్యటనలు చేసి బాధితులను పరామర్శించేవారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం మాత్రం ఎన్నికల కంటే ప్రజా సమస్యలకే ప్రాధాన్యతనిస్తూ తుఫాన్ సమయంలో సహాయక చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే పనిగా కొందరు పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. పరిషత్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అన్ని విషయాలపై మాట్లాడతానని తెలిపారు.

పొలం గట్లపై సీఎం చంద్రబాబు.. క్షేత్రస్థాయిలో రైతులకు అండ..





పెను నష్టాన్ని నివారించడంలో యంత్రాంగం సఫలమైంది.

క్షేత్రస్థాయిలో పర్యటనలతో వాస్తవాల పరిశీలన అధికారులు ఇచ్చే నివేదికలతో సరిపెట్టకుండా, వాస్తవ నష్టాన్ని కళ్లారా చూసేందుకు చంద్రబాబు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవలి 'అర్నబ్' తుపాను సమయంలో కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన నుంచి పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం వరకు దెబ్బతిన్న ప్రాంతాలను సందర్శించారు. తాజాగా 'మురసు' తుపాను కారణంగా అతలాకుతలమైన బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి, గుంటూరు జిల్లాలోని రేటూరు గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన వరి పొలాల్లోకి వెళ్లి, పంట బోదెల వద్ద నిలబడి నష్టాన్ని అంచనా వేశారు. బురదలో, పొలం గట్లపై తిరిగి పంటలు దెబ్బతిన్న వైనాన్ని కళ్లారా చూశారు. పర్యటనలో భాగంగా, రైతుల వద్దకే నేరుగా వెళ్లి వారి ఆవేదనను ఓపికగా విన్నారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టపోయారు, ఎంత పెట్టుబడి పెట్టారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం ఆశిస్తున్నారనే వివరాలను వారినే అడిగి తెలుసుకున్నారు. కష్టపడి పండించిన పంట కళ్ల ముందే నీటిపాలైన రైతుల బాధను చూసి చలించిన ఆయన, అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు కుంగిపోకుండా, తిరిగి ధైర్యంగా వ్యవసాయం చేసుకునేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.





ఆంధ్రప్రదేశ్‌లో జలకళ.. రిజర్వాయర్లలోకి కొత్త నీరు..

ఇతర బేసిన్లలోని ప్రాజెక్టులలో కలిపి 58.72 టీఎంసీల నీరు ఉంది. అయితే, ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు మిశ్రమంగా ఉన్నాయి. శుక్రవారం నాటి లెక్కల ప్రకారం, శ్రీశైలం డ్యామ్‌లో 215.81 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను కేవలం 51.60 టీఎంసీల (23.9%) నీరు మాత్రమే ఉంది. ఇక్కడ నీటిమట్టం 885 అడుగులకు గాను 832 అడుగుల వద్ద ఉంది. నాగార్జున సాగర్‌లో 180.91 టీఎంసీలు (58%), పులిచింతలలో 28.19 టీఎంసీల (61.6%) నీరు నిల్వ ఉంది. మరోవైపు, పెన్నా బేసిన్‌లోని సోమశిల ప్రాజెక్టులో 19.74 టీఎంసీలు (25.3%), కండలేరులో 16.70 టీఎంసీలు (24.6%) ఉన్నాయి. అదే సమయంలో, గండికోట (69.5%), గోరకల్లు (78.8%), ఏలేరు (91%) వంటి రిజర్వాయర్లలో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, నవంబరు 4 ఉదయం 8.30 గంటల నుంచి నవంబర్ 5 ఉదయం 8:30 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా సగటున 10.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మొత్తం మీద రాష్ట్రంలో నీటి నిల్వలు పెరిగినప్పటికీ, శ్రీశైలం వంటి కీలక ప్రాజెక్టులు నిండాలంటే భారీ వర్షాలు అవసరమని స్పష్టమవుతోంది.

రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు సిద్ధరామయ్య గైర్హాజరు!

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి దూరంగా ఉన్నారు. ఈరోజు రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు తాను హాజరుకాలేనని, ముందుగా నిర్ణయించుకున్న పర్యటన ఉందని ఆయన పార్టీకి తెలియజేశారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ ఈ సమావేశానికి హాజరవుతారని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం సిద్ధరామయ్య ఈరోజు హాసన్ జిల్లా పర్యటనకు వెళ్లారు. అక్కడ చారిత్రక హసనాంబ ఆలయంలో జరుగుతున్న వార్షిక జాతర మహోత్సవంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకోనున్నారు. హొయసల కాలం నాటి ఈ ఆలయం అక్టోబర్ 29న భక్తుల కోసం తెరుచుకోగా, నవంబర్ 11న ఉత్సవాలు ముగియనున్నాయి.ఇదిలా ఉండగా, ఇటీవల తనపై వచ్చిన నకిలీ స్టింగ్ ఆపరేషన్ వీడియో వ్యవహారంపై చర్చించేందుకు సిద్ధరామయ్య ఈనెల 3న ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాతే ఆయన రాహుల్ సమావేశానికి గైర్హాజరు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, సిద్ధరామయ్యను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన స్టింగ్ వీడియోపై బెంగళూరు పోలీసులు కీలక ప్రకటన చేశారు. ఈ వీడియోలో ఉన్న లైంగిక వేధింపుల ఆరోపణలు 'కల్పితం, ఉద్దేశపూర్వకంగా సృష్టించిన కథనం' అని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని తెలిపారు. వీడియోలో కనిపించిన వ్యక్తులందరినీ విచారించామని, వారి వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాల ప్రకారం ఆ ఆరోపణలు కట్టుకథ అని తేలినట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వీడియో సృష్టి, రికార్డింగ్, సర్క్యులేషన్‌పై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని వారు స్పష్టం చేశారు.

చీరాల మున్సిపాలిటీపై టీడీపీ జెండా, చైర్‌పర్సన్‌గా హనీ స్పందన విజయం

బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఎరిచర్ల హనీ స్పందన తన ప్రత్యర్థిపై దాదాపు 6,468 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. దీంతో ఆమె చీరాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పీఠాన్ని అధిష్టించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 3న జరిగింది. అయితే 'మురసు' తుపాను ప్రభావంతో చీరాలలో మాత్రం కౌంటింగ్‌ను నవంబర్ 6కి వాయిదా వేశారు. శుక్రవారం జరిగిన లెక్కింపులో టీడీపీ మున్సిపల్ పీఠంతో పాటు పట్టణంలోని పలు వార్డుల్లోనూ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించింది.

వార్డుల వారీగా ఫలితాల సరళి మొత్తం 44 వార్డులకు జరిగిన ఓట్ల లెక్కింపు పూర్తయింది. అధికారికంగా అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం టీడీపీ మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. దాదాపు 22 వార్డుల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలిచినట్లు తెలుస్తోంది.

శాంతిపురం కేసులో టీడీపీ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి భారీ ఊరట.

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డితో పాటు పలువురు టీడీపీ నేతలకు భారీ ఊరట లభించింది. 2021లో శాంతిపురంలో రైతుల సమస్యలపై నిర్వహించిన ధర్నాకు సంబంధించి నమోదైన కేసును కుప్పం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సహా మొత్తం 29 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్దోషులుగా బయటపడ్డారు. 2021లో రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ టీడీపీ నేతలు చేసిన ఆందోళనపై రాళ్లబుదుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో విచారణ జరిగింది. ఇందులో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని ఏ-1 నిందితుడిగా చేర్చగా, పి. మనోహర్, పి.ఎస్. మునిరత్నం, గౌనివారి శ్రీనివాసులు వంటి మరికొందరు నేతలు కూడా నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి ఈరోజు తుది విచారణ జరగగా, ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి సహా ఇతర నేతలు కోర్టుకు హాజరయ్యారు. వాదనలు విన్న న్యాయస్థానం, కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పుపై టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్ష సాధింపుతోనే తమపై తప్పుడు కేసులు బనాయించారని, చివరకు న్యాయమే గెలిచిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి వ్యాఖ్యానించారు.

చీరాల మున్సిపాలిటీలో అనూహ్య ఫలితాలు..

ఆంధ్రప్రదేశ్ పురపాలక ఎన్నికల ఫలితాల్లో బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీ ఫలితాలు ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీ కూటమి హవా కొనసాగినప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా పుంజుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో కాంగ్రెస్ ఏకంగా నాలుగు వార్డులను కైవసం చేసుకుని దశాబ్ద కాలం తర్వాత తన ఉనికిని చాటుకుంది. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 3న జరిగింది. అయితే మురసు తుపాను ప్రభావంతో చీరాలలో కౌంటింగ్ నవంబరు 6కి వాయిదా పడింది. ఈ నేపథ్యంలో, నేటి ఓట్ల లెక్కింపులో ఆశ్చర్యకర ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల ప్రకారం టీడీపీ 12 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 4, వైఎస్సార్సీపీ 2 వార్డులను గెలుచుకున్నాయి. చీరాలలో కాంగ్రెస్ ఈ స్థాయిలో విజయం సాధించడం వెనుక మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌లో చేరిన ఆమంచి కృష్ణమోహన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గట్టి పోటీ ఇవ్వడమే కాకుండా, విజయకేతనం ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 1, 21, 25, 33వ వార్డులలో విజయం సాధించారు. ముఖ్యంగా 25వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి వెంకట్రావు.. బీజేపీ, వైసీపీ అభ్యర్థులను వెనక్కి నెట్టడం గమనార్హం. రాష్ట్రంలో ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఫలితాలు కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ విజయంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) హర్షం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా వేదికగా విజేతలకు శుభాకాంక్షలు తెలిపింది. "ప్రజలు మీపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజాసేవలో ముందుండి, వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి" అని ఆకాంక్షించింది. పూర్తిస్థాయి ఫలితాలు ఇంకా వెలువడాల్సి ఉన్నప్పటికీ, చీరాలలో కాంగ్రెస్ ప్రదర్శన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

కేసులతోపాటు రెవెన్యూ రికవరీ చట్ట ప్రయోగం

ఇకపై రాష్ట్రంలో అక్రమ మైనింగ్ చేసేవారికి వెన్నులో వణుకుపుట్టేలా చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఇసుక, ఎర్రమట్టి, రోడ్‌మెటల్ తదితర సూక్ష్మ ఖనిజ వనరులను తవ్వితీసి అక్రమంగా తరలించుకుపోయేవారిపై ఉక్కుపాదం మోపనుంది. వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు, అక్రమార్కులపై రెవెన్యూ రికవరీ చట్టం(ఆర్ఆర్ యాక్ట్)ను ప్రయోగించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఇసుక, ఎర్రమట్టి, రోడ్‌మెటల్ తదితర సూక్ష్మ ఖనిజ వనరులను తవ్వితీసి అక్రమంగా తరలించుకుపోయేవారిపై ఉక్కుపాదం మోపాలని సర్కారు నిర్ణయించింది. చట్టపరంగా కఠినతరమైన కేసులను నమోదు చేయడంతోపాటు, అక్రమార్కులపై రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్ఆర్ యాక్ట్)ను ప్రయోగించాలని నిర్ణయించింది. ఇకపై రాష్ట్రంలో ఇసుక, మట్టిని అక్రమంగా తవ్వి తరలించుకుపోవాలంటే వెన్నులో వణుకుపుట్టేలా గనులశాఖకు సర్కారు స్పష్టమైన కార్యాచరణ ఇచ్చింది.ప్రస్తుతం అక్రమ మైనింగ్‌ను నిరోధించే చట్టాలతోపాటు, ఇతర శాఖల పరిధిలోని చట్టాలను కూడా వర్తింపచేసి, కఠిన చర్యలు తీసుకునేలా గనుల శాఖతోపాటు మరో ఆరు శాఖలకు ఉమ్మడి కార్యాచరణ ఇచ్చింది. జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్‌కు మరిన్ని బాధ్యతలు, అధికారాలను కట్టబెట్టింది. అక్రమ తవ్వకాలు, రవాణా, నిల్వలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వ ర్గాల నుంచి వచ్చే ఫిర్యాదులకు జవాబుదారీ తీసుకొచ్చేలా గనులశాఖ 30 రోజుల వ్యవధిలో ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేసి నిరంతర సమీక్ష చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు గనుల శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా శుక్రవారం ఉత్తర్వులు (జీవో 278) జారీ చేశారు.ఇసుక, మట్టి, రోడ్ మెటల్, ఇతర వనరుల అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకుగాను, ఇకపై గనుల శాఖతో పాటు అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలు, జలవనరుల విభాగం, రవాణాశాఖలు, వాటి పరిధిలోని అనుబంధ విభాగాలు సంయుక్తంగా పనిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇసుక అక్రమ తవ్వకాలపై విచారించిన హైకోర్టు ప్రభుత్వానికి కొన్ని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. గనులు, ఖనిజాల పరిరక్షణ చట్టాలు, వాటి రూల్స్, మార్గదర్శకాల అమలును మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ పనితీరు మరింత మెరుగుపర్చడం, అక్రమార్కులపై కేసు నమోదు చేసిన దగ్గరి నుంచి ఆర్ఆర్ చట్టం ప్రయోగం వరకు వివిధ దశల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేసింది.ఫిర్యాదు రాగానే గనుల శాఖ స్పందించాలి. ఎవరి భూమిలో అక్రమ మైనింగ్ జరిగిందో గుర్తించాలి. అంటే, అది అటవీ భూమి అయితే, ఆ శాఖ తక్షణమే అటవీ చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలి. జలవనరుల శాఖదైతే, ఆ శాఖ అమలు చేసే చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలి. ఒకవేళ రెవెన్యూ భూమి అయితే ఆర్డీవో, లేదా తహశీల్దార్ చ ట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి.పట్టా భూమిలోనే అక్రమంగా ఇసుక, మట్టిని తవ్వి తీసుకెళ్తే.. రెవెన్యూ, గనుల శాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాలి. గ్రామ పంచాయతీ లేదా మున్సిపల్ పరిధిలో అక్రమం జరిగితే, ఆయా శాఖలు స్పందించి చర్యలు తీసుకోవాలి. అక్రమ తవ్వకాలపై ప్రజల నుంచి ఫిర్యాదు రాగానే అది తమ పరిధిలోది కాదని ఏ శాఖ కూడా తప్పించుకోవడానికి వీల్లేదు. విధిగా ఉమ్మడిగా కార్యాచరణ ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రతి ఫిర్యాదుకు కూడా యూనిక్ నెంబర్ కేటాయించాలి. ఫిర్యాదు రాగానే మూడు రోజుల్లోనే విచారణ పూర్తిచే యాలి. పక్కా ఆధారాలను రికార్డుచేయాలి. అక్రమ మైనింగ్ వ్యాపారం చేస్తూ ప్రభుత్వానికి తీవ్ర నష్టం చేస్తున్నారని నిర్ధారణ అయిన తర్వాత బాధ్యులపై చట్టపరంగా కేసులు నమోదుచేసి, వారి చర్యల వల్ల ప్రభుత్వానికి జరిగిన నష్టం ఎంతో రాబట్టే ప్రయత్నం చేయాలి. అక్రమాలకు ఉపయోగించిన వాహనాలను సీజ్ చేయడంతోపాటు, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి.

నెల్లూరును అతలాకుతలం చేసిన పెద గాలివాన



గాలివాన ఒక ప్రకృతి వైపరీత్యం. ఒక భయంకరమైన అనుభవం. వందేళ్ల క్రితం సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేని రోజుల్లో రేడియో వార్తలే ఆధారం. వార్తల్లో తుఫాను అని చెపితే గుండెల్లో గుబులు. సరిగ్గా వందేళ్ల నాటి నెల్లూరు పెద గాలివాన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ కథలు కథలుగా చెబుతూనే ఉంటారు.నవంబరు ఒకటి, 1927న నెల్లూరును తుఫాను కాటేసింది. అక్టోబరు 30వ తేదీ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. ఇది తుఫానుగా మారి నవంబరు 1, 2 తేదీల్లో నెల్లూరు వద్ద తీరం దాటింది. 12గంటల పాటు నెల్లూరును వణికించింది. ఒకటో తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు మొదలైన తుఫాను రెండో తేదీ అర్ధరాత్రి ఒంటిగంట వరకు బలమైన ప్రభావం చూపింది. 25 మైళ్ల రేడియస్‌తో కోవూరు నుంచి గూడూరు డివిజన్ వరకు ప్రతాపాన్ని చూపింది. కడప జిల్లా వరకు ఈ ప్రభావం ఉన్నప్పటికీ నెల్లూరు జిల్లా మాత్రం పూర్తిగా అతలాకుతలమైంది.ఒకటో తేదీన జిల్లా యంత్రాంగం సైతం నిర్వేదంలో ఉండిపోయింది. ఏమి జరుగుతుందో కూడా చూడలేని భయానక స్థితి. అధికారులు సైతం బయటకు రాలేని ప్రచండ తుఫాను అది. ఆ విధ్వంసం రోజున నెల్లూరు పట్టణంలో వేల ఇళ్ల కిటికీలు, ద్వారబంధాలు గాలికి ఊడి పడిపోయాయి. రెండో తేదీన అధికారులు బయటకు వచ్చి చూసేటప్పటికి నెల్లూరు స్వరూపమే మారిపోయింది. వందలాది చెట్లు పడిపోయాయి. రోడ్లు, వీధులు కూలిన చెట్లతో నిండి ఉన్నాయి. పెంకుటిళ్లు పడిపోయాయి. ముత్తుకూరు, కోవూరు, గూడూరు తాలూకా ఆఫీసు, పబ్లిక్ భవనాలు నిట్టనిలువుగా కూలిపోయాయి. కలెక్టర్ ఇంటి భవనం, ప్రభుత్వ ఆస్పత్రి భవనాలు కూలిపోయాయి. కలెక్టర్ కార్యాలయ కాంపౌండులో మర్రిచెట్లు వేళ్లతో సహా నేలకూలింది. టౌను హాలు, జూబ్లీ హాస్పిటల్ బాగా దెబ్బతిన్నాయి. అప్పటికే పక్కాభవనాలు నిర్మించుకున్న చర్చిలు, ప్రైవేటు ఆస్పత్రులు, మిషన్ స్కూలు భవనాలు కూలిపోయాయి. మునిసిపాలిటీ వాటర్ వర్క్స్, ఆయిలుతో ఏర్పాటుచేసిన పట్టణంలోని వీధి దీపస్తంభాలు, వాషింగ్టన్ లైట్స్ కూడా దెబ్బతిని చాలాకాలం నెల్లూరును అంధకారంలో ఉంచాయి. పెద్ద పడుగుపాడు వద్ద గూడ్సురైలు పడిపోయింది. పెన్నా వరదల వల్ల ఉత్తర, దక్షిణాలకు సంబంధాలు తెగిపోయాయి. టెలిగ్రాఫ్ వ్యవస్థ ధ్వంసమైంది. మామిడి, కొబ్బరి, తాటిచెట్లు లక్షల్లో పడిపోయాయి. దీంతో కొంతకాలం వరకు ఇంటిని కప్పుకొనేందుకు తాటి ఆకులు కూడా దొరకని పరిస్థితి. పశువులు, కోళ్లు, మేకలు కూడా వందలాదిగా చనిపోయి పల్లెలు దుర్గంధపు కేంద్రాలయ్యాయి. ఈ గాలివానకు 629 మంది చనిపోయినట్లు అధికారులు ధృవీకరించారు. ఇందులో 378మంది నెల్లూరు తాలూకాలో, నెల్లూరు పట్టణంలో 22మంది, కోవూరు తాలూకాలో 113మంది మృతిచెందారు. భవనాలు, పైకప్పులు, జింక్ షీట్లు కూలటం నెల్లూరులో ప్రమాదాలకు కారణం అయింది. మరికొంతమంది గాలికి కొట్టుకుపోతూ మృతిచెందారు. ఇంకొందరి అచూకీ లేదు. 50,324 పశువులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కోవూరు, రావూరు, నెల్లూరు తాలూకాలలో ఈ ఘటనలు ఎక్కువగా నమోదయ్యాయి. పశువులు, మనుషులు మృతిచెందటం, మృతదేహాలు కుళ్లిపోవటం, పారిశుధ్యానికి సిబ్బంది కూడా లేని భయానక పరిస్థితిలో కలరా వ్యాపించింది. నెల్లూరులో 1880 మందికి కలరా సోకి, 876మంది మృత్యువాత పడ్డారు. కోవూరు తాలూకాలో 700 మందికి కలరా సోకి అందులో 190మంది మృతి చెందారు. గాలివాన తర్వాత కూడా పదిరోజుల పాటు వర్షాలు పడుతూనే ఉండటం జిల్లాకు శాపమైంది. నష్టాన్ని చూసేందుకు మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి రెవెన్యూ అధికారి హెచ్.జి. స్టోక్స్ నెల్లూరొచ్చారు. మద్రాసు గవర్నరు లార్డ్ గోషన్ జిల్లాలో పర్యటించి 20వేల రూపాయలను తుఫాను బాధితుల సహాయార్థం అందజేశారు. కలరా బాధితులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ముత్తుకూరు, సర్వేపల్లి, కొడవలూరు, ఫిర్యాలలో రామకృష్ణమిషన్ అమోఘమైన సేవలు అందించింది. బియ్యం, బట్టలు మాత్రమే కాక, ఇళ్లు కూడా ఈ సంస్థ నిర్మించింది. జాలర్లకు పడవలు చేయించింది. చిన్న ఉద్యోగులకు వంద రూపాయలు వడ్డీలేకుండా రుణం ఇచ్చింది. గాలివాన, కలరా వల్ల చాలామంది పిల్లలు అనాథలయ్యారు. ఆరు అనాథాశ్రమాలు కూడా వీరి కోసం ఏర్పాటు చేశారు. గాలివాన వచ్చిన ఐదురోజుల తర్వాత కూడా పెన్నాకు వరదలు వస్తున్నాయనే భయాందోళన పట్టణంలో నెలకొంది. ఇళ్లు, గూళ్లు వదిలేసి ప్రజలంతా ఎత్తు ప్రాంతంలో ఉన్న (ప్రస్తుతం దర్గామిట్ట) జిల్లా కలెక్టర్, ఎస్.పి బంగళాలకు చేరుకున్నారు. అధికారులు విచారించి, ఇది కేవలం పుకారు అని, ఎద్దుల బండ్లు ఏర్పాటుచేసి ప్రజలను ఇళ్లకు పంపారు.

చీరాలలో 10 స్థానాల్లో గెలుపు.. కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం: షర్మిల

చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సాధించిన విజయాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశంసించారు. ఈ ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పీపీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌కు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.44 స్థానాల్లో భాగంగా కాంగ్రెస్ 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టింది. వారిలో 10 మందిని గెలిపించడంతో పాటు, మిగతా స్థానాల్లోనూ పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ఆమంచి ప్రత్యక్షంగా కృషి చేశారని షర్మిల పేర్కొన్నారు."కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం. స్థానికంగా ప్రజా సమస్యలపై మీ అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనం" అని ఆమె అన్నారు. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం నిజమైన ప్రజాస్వామ్య విజయమని, రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయమనడానికి ఇదొక సంకేతమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రజల గొంతుకను నొక్కిపట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజా పక్షాన నిలిచి గెలిచిన వార్డు సభ్యులను షర్మిల అభినందించారు. అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు, కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసిన చీరాల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల భద్రత గాలికి..

అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో?

నాలుగు ఐదు నెలలుగా మరమ్మతులకు నోచుకోని కస్తూర్బా పాఠశాల కాంపౌండ్ వాల్ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?



కలసపాడు,నవంబర్ 6(:నంది పత్రిక): కడప జిల్లా కలసపాడు మండలం పెండ్లిమర్రి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల ఆవరణకు రక్షణగా ఉండాల్సిన కాంపౌండ్ వాల్ కూలిపోయి దాదాపు నాలుగు నుంచి ఐదు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

బాలికల భద్రతపై ఇంత నిర్లక్ష్యమా? బాలికలు విద్యనభ్యసించే వసతి విద్యాలయాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంతో పాటు సంబంధిత అధికారులపై ఉంది. కాంపౌండ్ వాల్ కూలిపోయి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పాఠశాల ఆవరణకు రక్షణ లేకపోవడంతో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొనే పరిస్థితి ఉంది.ఇటీవల రాప్తాడు పాఠశాలలో చోటుచేసుకున్న బాలికలపై దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలోనైనా విద్యాశాఖ అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని సదుపాయాలు ఉన్న పాఠశాలల్లోనే ఇలాంటి దారుణ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పుడు, కనీసం కాంపౌండ్ వాల్ కూడా సరిగా లేని విద్యాలయాల్లో బాలికల భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారులు స్పందించకపోతే బాధ్యత ఎవరిది?

ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేయడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం అధికారుల బాధ్యత. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ ఉన్నతాధికారులు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తక్షణమే స్పందించాలి. కూలిపోయిన కాంపౌండ్ వాల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు ఫణి రావు, ప్రవీణ్, రాజు, సుహాసిని,రామకోటి డిమాండ్ చేస్తున్నారు.బాలికల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. విద్యార్థినుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

నంద్యాల జిల్లాస్థాయి

ర్యాంకింగ్ చెస్ పోటీలు ప్రారంభం

-ప్రారంభించిన నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ

-వేదిక: హనీఫ్ నగర్ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్

-12 వివిధ వయసు కేటగిరీలలో వేరు వేరు గా పోటీలు



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 06 . (నంది పత్రిక):నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ ఆర్ జి చెస్ అకాడమీ నిర్వహణలో శుక్రవారం నంద్యాల హనీఫ్ నగర్ లో ఉన్న రోటరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు, పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య సహకారంతో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి మూడవ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చదువుతోపాటు కళలు,క్రీడలు దోహదం చేస్తాయని అన్నారు. చదరంగం మేధో శక్తిని పదును పెడుతుందని అన్నారు.ప్రస్తుతం కృత్రిమ మేధ పై ఎక్కువగా ఆధార పడే పరిస్థితికి వస్తున్నదని, ఈ నేపథ్యంలో బాలలలో ఆలోచనా శక్తిని,విశ్లేషణ నైపుణ్యాన్ని పెంచడానికి సరైన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ అవసరమైనంత మేరకు వినియోగించుకోవాలని, ఎక్కువగా ఆధారపడకుండా ఉండడం అవసరమన్నారు. ఈ విషయంపై ఐఎంఏ, కళారాధన, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మేధావులు, విద్యావేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తల్లిదండ్రులతో చర్చా వేదిక నిర్వహించి తగిన సూచనలను ప్రభుత్వానికి అందివ్వడం జరుగుతుందన్నారు.జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరు వేరుగా నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ పోటీల లో ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క కాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. మొత్తం ఐదు జిల్లా స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్లు నిర్వహించి ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయిలో వారికి ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి హనీఫ్ నగర్ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ సుష్మ, క్యాంపస్ ఇంచార్జ్ నస్రీన్, చీఫ్ ఆర్బిటర్ సుజాత,టోర్నమెంట్ ఆర్గనైజర్ అరుణ్ కుమార్, నిర్వాహకులు శాంతినికేతన్ సురేష్,మాధవి, రమ్య, కోచ్ సురేష్ కుమార్ చెస్ క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీశైలం జల నిర్వహణపై ముఖ్యమంత్రికి రాయలసీమ సాగునీటి సాధన సమితి లేఖ.



కె ఆర్ ఎం బి, సి డబ్ల్యూ సి క్రియారాహిత్యంపై కేంద్రంతో ముఖ్యమంత్రి రాజకీయ, దౌత్యపరమైన చొరవ చూపాలి. రాయలసీమ శాశ్వత జలభద్రతకు తక్షణమే విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యమంత్రికి లేఖ రాసిన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి.

నంద్యాల ప్రతినిధి. నవంబర్ 06 . (నంది పత్రిక):వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో రాయలసీమలో తీవ్రతరమవుతున్న తాగునీరు, సాగునీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ, శ్రీశైలం జలాశయ నిర్వహణపై తక్షణ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి లేఖ రాసింది.ఈ లేఖను గురువారం కర్నూలులో జలవనరుల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ మహేష్ కి సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అందజేసి, సమస్య తీవ్రతను వివరించారు.

వర్షాభావంతో రైతాంగం కుదేలు శ్రీశైలం నీటి సంరక్షణలో వైఫల్యం.

2026 ఖరీఫ్‌లో జూన్, జూలై వర్షాలతో రైతులు ఆరుతడి పంటలు, వరి నారుమళ్లు సాగు చేసినప్పటికీ, ఆగస్టు నుంచి వర్షాలు నిలిచిపోవడంతో నారుమళ్లు ఎండిపోయి, వరి నాట్లు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సాధారణ దిగుబడిలో 1020 శాతం కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.202526లో సుమారు 2,259 టీఎంసీల కృష్ణా జలాలు వచ్చినప్పటికీ, 2026 మే 31 నాటికి శ్రీశైలం జలాశయంలో బచావత్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం 854 అడుగుల కనీస నీటిమట్టంతో పాటు అదనంగా 60 టీఎంసీల క్యారీ ఓవర్ నిల్వను తప్పనిసరిగా కాపాడాల్సి ఉందని వివరించారు. అయితే, ఈ నిబంధనలను అమలు చేయకపోగా, కనీస నీటి నిల్వ కంటే 60 టీఎంసీలు తక్కువగా నీటిని నిల్వ ఉంచడం ద్వారా రాయలసీమ పట్ల తీవ్ర వివక్షతను ప్రదర్శించారని ఆయన ఘాటుగా విమర్శించారు. 202627లో ఇప్పటివరకు సుమారు 218 టీఎంసీలు చేరినా, నీటి సంరక్షణపై తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటి విడుదల సీమ జలభద్రతకు ముప్పు.

శ్రీశైలంలో తాగునీటి అవసరాలకే నీటి విడుదల పరిమితం చేయాలని కె ఆర్ ఎం బి సూచించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రం నుంచి నీటి విడుదల కొనసాగించిందని తెలిపారు. ఈ నీటిని శ్రీశైలంలోనే నిల్వ ఉంచి ఉంటే రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు, మహబూబ్‌నగర్, నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాల తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగపడేదని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి సమితి ప్రధాన డిమాండ్లు.

1.కనీస నీటిమట్టం: శ్రీశైలంలో 854 అడుగుల కనీస నీటిమట్టంతో పాటు 60 టీఎంసీల క్యారీ ఓవర్ నిల్వను తప్పనిసరిగా నిర్వహించాలి.

2.విద్యుత్ ఉత్పత్తి నియంత్రణ: బచావత్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారమే విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలి. నాగార్జునసాగర్ ఆయకట్టు అవసరాలకు మించి విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని విడుదల చేయరాదు.


3.ప్రాధాన్యతా క్రమం: రాష్ట్ర విభజన చట్టం నిర్దేశించిన ప్రాధాన్యత ప్రకారం తాగునీరు, వ్యవసాయ అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, ఆ తర్వాతే విద్యుత్ ఉత్పత్తికి నీటిని వినియోగించాలి.

4.కేంద్రంపై రాజకీయ, దౌత్యపరమైన చొరవ: కె ఆర్ ఎం బి, సి డబ్ల్యూ సి వెనుకబడిన ప్రాంతాల జలహక్కుల పరిరక్షణలో సమర్థవంతంగా వ్యవహరించని నేపథ్యంలో, ముఖ్యమంత్రి కేంద్ర హోంశాఖ మంత్రి, ప్రధానమంత్రితో చర్చించి అవసరమైన నిర్ణయాలు అమలయ్యేలా చొరవ తీసుకోవాలి.రాయలసీమ ప్రజలకు తాత్కాలిక పంట నష్టపరిహారం మాత్రమే కాదు, ప్రతి కరువు సమయంలో తాగునీరు, సాగునీటి కోసం ఆందోళన చెందాల్సిన పరిస్థితి నుంచి శాశ్వత విముక్తి కావాలని బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. శ్రీశైలం జలాశయాన్ని సమగ్రంగా నిర్వహిస్తూ రాయలసీమకు శాశ్వత జలభద్రత కల్పించేలా ముఖ్యమంత్ర తక్షణ కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు వాడాల చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

గెలుపులపై అంచనాలు

కౌంటింగ్ కు సిద్ధమవుతున్న ఏజెంట్లు

బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 6: ఎంపీటీసీ, జడ్పిటిసి జరిగిన ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో గెలుపులపై ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరికి వారే అంచనాలు వేసుకుంటున్నారు. బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జడ్పిటిసి స్థానానికి రెండు రోజుల క్రితం ఎన్నికలు జరిగిన సంగతి విధితమే. 14 ఎంపీటీసీ స్థానాలలో, కూటమి ప్రభుత్వంలో భాగంగా, బీ.కోడూరు ఎంపిటిసి స్థానాన్ని జనసేన పార్టీకి, పెద్దదేవలాపురం ఎంపీటీసీ స్థానం బిజెపి పార్టీకి కేటాయించడం జరిగింది. ఓటింగ్ సరళిని తీరుతెనులను దృష్టిలో ఉంచుకొని, మంచి మెజార్టీతో మేము గెలుస్తామంటే, కాదు మేమే గెలుస్తామని ఊహల పల్లకిలో విహరిస్తున్నారు. అభ్యర్థుల ఊహలకు శుక్రవారం జరిగే కౌంటింగ్ తో తెరపడబోతోంది. మరోవైపు నంద్యాలలో జరిగే కౌంటింగ్లో పాల్గొనేందుకు ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు ఏజెంట్ పారాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన ఇరు పార్టీల ఏజెంట్లకు రిటర్నింగ్ అధికారి సంతకాల తో కూడిన పా సులను అందజేశారు.



వేరువేరు ప్రదేశాల్లో రోడ్డు ప్రమాదాలు





-ఐదు మందికి రక్తగాయాలు

-ఒకరికి కాలు విరిగిన వైనం

కొత్తపల్లి – నంది పత్రిక : మండలంలోని వేరు వేరు ప్రదేశాలలో రెండు చోట్ల బైకులు ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదాలు గురిఅయిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెలితే జి.వీరాపురం గ్రామానికి చెందిన విశ్వనాథ రెడ్డి బైకుపై ఆత్మకూరు వైపు వెలుతున్నాడు. అదే సమయంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన మురళీ అనే యువకుడు ఆత్మకూరు వైపు నుంచి కొత్తపలి గ్రామానికి బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి, బావాపురం గ్రామాల మధ్యలోని వరదరాజ స్వామి ప్రాజెక్ట్ కాలువ వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో విశ్వనాథ రెడ్డికి ఎడమ కన్ను క్రింది భాగంలో లోతైన గాయం అయింది. మురళీ అనే యువకుడికి అక్కడక్కడ రక్తగాయాలు అయ్యా. గమనించిన స్థానికులు కొత్తపల్లి వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స అందించి కర్నూలుకు మెరుగైన వైద్యం కోసం వైద్యులు రెఫర్ చేశారు అదేవిధంగా మండలంలోని జి. వీరాపురం గ్రామం సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ప్రమాదం సంబవించింది. శివపురం గూడెంకు చెందిన అంకులయ్య. చరన్ పాలెంచెరువు గూడెంకు చెందిన అంకన్నను శివపూరం గూడెం నుంచి ఒకే బైకుపై పాలెం చెరువు గూడెంలో విడిచి పెట్టేందుకు వస్తున్నారు. ఇదే క్రమంలో గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన బోయ లక్ష్మన్న అనే వ్యక్తి బైకుపై కొత్తపల్లివైపు వెలుతున్నాడు. ఈక్రమం వీరాపురం గ్రామం వద్ద ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొని ప్రమాదం జరగింది. ఈ ప్రమాదంలో శివపురం గూడెంకు చెందిన అంకులయ్యకు కుడి కాలు విరిగింది. చరణ్ తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే ప్రమాదంలో బోయ లక్ష్మన్నకు తలకు రక్తగాయాలు అయ్యాయి. అటువైపుగా వెల్తున్న కొందరు 108 కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని వారిని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంత రం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా చరణ్ అనే యువకుడికి కుడి కాలు

శ్రీ చైతన్య పాఠశాలలో

మెగారక్తదాన శిబిరం నిర్వహణ

కడప నవంబర్ 6 (నంది పత్రిక రిపోర్టర్) శ్రీ చైతన్య విద్యాసంస్థల అధ్యక్షురాలు శ్రీమతి ఝాన్సీ లక్ష్మీ బాయి జ న్మదినోత్సవం సందర్భంగా, శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు కడప ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సహకారంతో శ్రీ చైతన్య పాఠశాల కడప-6 ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కడప శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం రమణయ్య , రిమ్స్ మెడికల్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ , శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ ల డీన్ బి.నాగరాజు, చైతన్య పాఠశాలల ఆర్ఐ భాస్కర్ , కళాశాల ప్రిన్సిపల్స్ వి.శివ ప్రసాద్, ఎన్ వి సుభాష్, చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్లు, కోఆర్డినేటర్లు, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఏజీఎం రమణయ్య విద్యార్థులకు రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. శ్రీ చైతన్య విద్యా సంస్థలు ఎల్లప్పుడూ సామాజిక సేవ వైపు ముందుకు సాగుతాయని ఆయన తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం రక్తదాతలందరినీ అభినందనలు తెలుపుతూ సర్టిఫికెట్ అందజేశారు

రెండో వన్డేకు వర్షం ముప్పు.. మరోసారి యంగ్ పేసర్లపై టీమిండియా ఆశలు

ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో గెలిచిన భారత జట్టు, ఇప్పుడు రెండో వన్డేకు సిద్ధమైంది. వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో శనివారం జరిగే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను మరోసారి దెబ్బతీసి, సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని పట్టుదలగా ఉంది.

చెంచుగూడెంలో ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో

ఘనంగా 'జాయ్ ఆఫ్ గివింగ్'







గిరిజనులకు దీపావళి కానుకగా టపాకాయలు, నిత్యవసర సరుకులు పంపిణీ

చిన్నతనం నుంచే సామాజిక సేవా గుణం అలవర్చుకోవడం అభినందనీయం : తహశీల్దార్ రమాదేవి

మానవీయ విలువల పెంపొందించడమే లక్ష్యం - ప్రిన్సిపాల్ గాయత్రి...

మహానంది నవంబర్ 06 (నంది పత్రిక):- సమాజంలో తోటివారికి సహాయం చేయడంలోనే అసలైన ఆనందం ఉందని చాటిచెబుతూ ఆర్జీఎం ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'జాయ్ ఆఫ్ గివింగ్' (ఆనందంగా పంచుకోవడం) కార్యక్రమంలో భాగంగా మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెంలోని నిరుపేద గిరిజన కుటుంబాలకు విద్యార్థులు నిత్యావసర వస్తువులు, దీపావళి క్రాకర్స్ (చిచ్చుబుడ్లు, లక్ష్మి బాంబులు) పంపిణీ చేశారు. రాబోయే దీపావళి పండుగను పురస్కరించుకుని విద్యార్థులు చూపిన ఈ ఉదారతపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ రమాదేవి, మహానంది దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్జీఎం స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి హాజరై విద్యార్థుల సేవానిరతిని కొనియాడారు.

చిన్నతనం నుంచే సామాజిక స్పృహ అవసరం – తహశీల్దార్ రమాదేవి:

ఈ సందర్భంగా తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే విద్యార్థులకు సమాజ సేవ పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. చెంచుగూడెం వాసుల ముఖాల్లో చిరునవ్వులు నింపేలా విద్యార్థులు చేసిన ఈ కృషి ఎంతో గొప్పదని కొనియాడారు.

పంచుకోవడంలోనే నిజమైన తృప్తి ఉంది –

మహానంది దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి:

మహానంది దేవస్థానం చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగ పూట పేద కుటుంబాలకు ఆసరాగా నిలవడం నిజమైన పండుగ సంస్కృతి అని చెప్పారు. తోటివారితో పంచుకోవడంలో ఉన్న తృప్తి మరెందులోనూ ఉండదని ఆయన పేర్కొన్నారు.

మానవీయ విలువల పెంపొందించడమే లక్ష్యం – ప్రిన్సిపాల్ గాయత్రి:

ఆర్జీఎం పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి మాట్లాడుతూ.. కేవలం పుస్తకాల జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో మానవీయ విలువలు, దయాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే తమ పాఠశాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సేవను అందించడం తమకు ఎంతో గర్వకారణమని తెలిపారు.

ఆకట్టుకున్న చెంచుల నాట్యం – విద్యార్థుల ఇంటర్వ్యూ

గిరిజన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. స్థానిక గిరిజన చిన్నారులు తమ సాంప్రదాయ శైలిలో చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గిరిజన సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలు వీక్షకులను అలరించాయి.అనంతరం ప్రతిభ కనబరిచిన చిన్నారులను, గిరిజన కళాకారులను తహశీల్దార్ రమాదేవి, మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ గాయత్రి ఘనంగా అభినందించారు.గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు అరుదైనవని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా వారు కొనియాడారు.అనంతరం విద్యార్థులు గిరిజనుల జీవన విధానం, వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి పలు ఆరోగ్య సూచనలు చేస్తూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు చెంచుగూడెం వాసులు , పలువురు పాల్గొన్నారు.









పర్యావరణ కాలుష్యం నీటి కాలుష్యాన్ని నివారిద్దాం.



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 06 (నంది పత్రిక): పర్యావరణ కాలుష్యాన్ని నీటి కాలుష్యాన్ని నివారిద్దామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. శుక్రవారంసి. చైతన్య కుమార్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్. డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ ఆదేశాల మేరకు, రుద్రవరం రేంజ్ అధికారి ఎస్. మూర్తుజా వలీ ఆధ్వర్యంలో రుద్రవరం రేంజి పరిధిలోనినూతల సెక్షన్ నరసాపురం గ్రామంలోని సెయింట్ తోమస్ మార్తోమ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో "బ్రిక్స్ పర్యావరణం కోసం జీవనశైలి లైఫ్‌అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు మరియు స్కూల్ పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 6వ రోజులో భాగంగా స్కూల్ పిల్లలకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన పర్యావరణ కాలుష్యం, నీటి కాలుష్యం మరియు సెల్ ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాటరీలు, ఎల్.సీ.డి స్క్రీన్ లలో ఉపయోగించే పాదరసం, సీసం, కాడ్మియం వంటి హానికర లోహాలువలన మనిషి జీవన విధానంపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి వంటి విషయాల పైన స్కూల్ విద్యార్థులకు వివరించారు. అలాగే, ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, గుడ్డ సంచులు మరియు జనపనార (జూట్) సంచుల వంటి పునర్వినియోగ ప్రత్యామ్నాయాలను వాడాలని నొక్కి చెప్పారు. అదేవిధంగా వృధా నీటిని అరికట్టాలని అంటే పబ్లిక్ టాప్స్ ను లీకేజ్ ని నివారించడం మరియు అనవసరంగా నీటిని వృధా చేయడం వంటివి చేయకూడదని తెలియజేశారు. అంతేకాకుండా, ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఇ-వేస్ట్) తగ్గింపు యొక్క ప్రాముఖ్యతను కూడా వివరించారు. ప్రతిరోజూ మన జీవితంలో చిన్నవి అయినప్పటికీ అర్థవంతమైన మార్పులను అలవర్చుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ప్రకృతిని రక్షించడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడానికి తోడ్పడగలరని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో అహోబిలం డిప్యూటీ రేంజర్ అన్వర్ హుస్సేన్,సెక్షన్ ఆఫీసర్లుపి. మబూఖాన్, టి. రామకృష్ణ, జి. శ్రీనివాసులు వి. జేమ్స్ పాల్.బీట్ ఆఫీసర్లు, బి.ఇ. నగేష్, నాగ హుసేనయ్య, నరసింహారెడ్డి ప్రొటెక్షన్ వాచర్లు. రేంజ్ సిబ్బంది మరియు సెయింట్ థామస్ మార్తోమ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ జిబిన్ మాథ్యూ జాయ్, స్కూల్ టీచర్స్,పిల్లలు చురుకైన భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిర జీవనంపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.



రుద్రవరంలో ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్, ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి.

జర్నలిస్టులపై దాడులను తీవ్రంగా ఖండించిన ఫెడరేషన్ నాయకులు



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 06 (నంది పత్రిక): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) 20వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రుద్రవరం లో ఘనంగా నిర్వహించారు. ఏపీ డబ్ల్యు జే ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు జిని నాగయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్‌ను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుల వృత్తిపరమైన భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, కలం స్వేచ్ఛను కాపాడటంతో పాటు ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. నంద్యాల జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, చిన్న పత్రికలను ప్రోత్సహించడంతో పాటు జర్నలిస్టుల కోసం ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు.ఏళ్ల తరబడి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులకు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి, పక్కా గృహాల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని నాయకులు పేర్కొన్నారు.ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జర్నలిస్టులు బైరిమోహన్, నాగ నరసింహులు, మద్దిలేటి, ఇమ్మానియేల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

కౌంటింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి

నంది పత్రిక కర్నూలు బ్యూరో : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై స్పెషల్ ఆఫీసర్లు, ఆర్వో లు, ఏ ఆర్వోలు తదితరులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు, అనుమానాలకు తావులేకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ తెరిచే సమయంలో ప్రతి రాజకీయ పార్టీ నుంచి అభ్యర్థులు లేదా వారి కౌంటింగ్ ఏజెంట్లకు ముందస్తుగా సమాచారం అందించి, వారి హాజరును నిర్ధారించుకోవాలన్నారు.స్ట్రాంగ్ రూమ్ తెరవడం, సీల్ తొలగించడం, బ్యాలెట్ బాక్సులను బయటకు తీసే ప్రక్రియను పూర్తిగా వీడియోగ్రఫీ చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. మొదటి రౌండ్ కౌంటింగ్ కనీసం ఉదయం 10.30 గంటలలోపు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే ఓట్లు, చెల్లని ఓట్లు గుర్తించడంపై కౌంటింగ్ సిబ్బందికి పూర్తి అవగాహన, స్పష్టత ఉండాలని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ టేబుళ్ల వద్ద చెల్లుబాటు అయ్యే, చెల్లని ఓట్లకు సంబంధించిన నమూనా ప్రింటెడ్ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందు ఉదయం 7 నుంచి 7.30 గంటల మధ్య సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, ఓట్ల చెల్లుబాటుపై సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ప్రారంభ రౌండ్‌లో కొంత సమయం తీసుకున్నప్పటికీ, ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏదైనా బ్యాలెట్ పేపర్‌పై సందేహం తలెత్తితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి వెంటనే తెలియజేయాలని, ఆయన సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రౌండ్‌లో అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఖచ్చితంగా లెక్కించి, వివరాలను ఎక్సెల్‌లో నమోదు చేసి ప్రింట్ తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు అవసరమైన సదుపాయాలు, కౌంటింగ్ సిబ్బందికి అల్పాహారం, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలన్నారు. కౌంటింగ్ హాల్‌కు దూరంగా తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది మొబైల్ ఫోన్లను కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించకూడదని, వాటిని భద్రపరిచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రారంభమైన తర్వాత ఏ కారణంతోనూ ప్రక్రియను నిలిపివేయడానికి వీల్లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏదైనా వ్యత్యాసం, సీరియల్ నంబర్లలో తేడా లేదా ఓట్ల లెక్కింపులో సందేహం తలెత్తితే సంబంధిత అంశాన్ని వెంటనే రికార్డు చేసి, రిటర్నింగ్ అధికారికి తెలియజేసి, కౌంటింగ్ కొనసాగించాలన్నారు.. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర సంబంధిత అధికారులు తమ బాధ్యతలను అత్యంత అప్రమత్తంగా నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఏర్పాట్లు నిబంధనల ప్రకారం పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, ఆర్వో లు, ఏ ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహరహిత భారత్ 100 రోజుల క్యాంపైన్ పై అవగాహన కార్యక్రమం.



రుద్రవరం ప్రతినిధి నవంబర్ 06 (నంది పత్రిక): బాల్య వివాహరహిత భారత్ 100 రోజుల క్యాంపియన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ రషీదా బేగం తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని యల్లావత్తుల ఉన్నత పాఠశాలలో పాఠశాల హెడ్మాస్టర్ వెంకట నరసింహయ్య ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల సంరక్షణ వివాహం సోషల్ వర్కర్ ఓబుళమ్మట్రీచర్ వర్కర్ సునంద కుమారి కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాలపై చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 మరియు ఫోక్సో చట్టం పై పిల్లల దత్తత విషయాలు మరియు ఆన్లైన్ మోసాల గురించి విషయాలపై పిల్లల సంరక్షణ రక్షణ కొరకై బాలల సంరక్షణ విభాగం ముఖ్య ప్రాధాన్యత ఇస్తుందని పిల్లలకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు మనోజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అలర్ట్: నవంబర్ 30లోగా లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వకపోతే పెన్షన్ కట్!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెన్షన్ పొందుతున్న విశ్రాంత ఉద్యోగులకు ఇది ముఖ్యమైన గమనిక. ప్రతినెలా పెన్షన్ సక్రమంగా అందాలంటే, 2026 నవంబర్ 30వ తేదీలోగా తమ వార్షిక డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్ పత్రం) సమర్పించడం తప్పనిసరి. ఈ గడువులోగా సర్టిఫికెట్ అందజేయని వారికి డిసెంబర్ నెల నుంచి పెన్షన్ చెల్లింపులు తాత్కాలికంగా నిలిచిపోయే అవకాశం ఉంది.పెన్షనర్ల సౌకర్యార్థం లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే ప్రక్రియను ప్రభుత్వం చాలా సులభతరం చేసింది. దీని కోసం పెన్షన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా బయోమెట్రిక్ ఆధారిత డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) కూడా పలు ఆన్‌లైన్, ఇంటి వద్దకే సేవలను అందిస్తోంది. పెన్షనర్లు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఉమాంగ్ (ఖఖీూచీ+) యాప్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ ఉపయోగించి సులువుగా సర్టిఫికెట్‌ను సమర్పించవచ్చు. అలాగే ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) ద్వారా ఉచితంగా ఇంటి వద్దకే వచ్చి ఈ సేవలను అందిస్తోంది. ఇవి మాత్రమే కాకుండా, చాలా ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు కూడా తమ ఖాతాదారులైన పెన్షనర్లకు డోర్‌స్టెప్ సేవలను అందిస్తున్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేనివారు సమీపంలోని ఈపీఎఫ్ఓ కార్యాలయం లేదా కామన్ సర్వీస్ సెంటర్ (జూజ)కు వెళ్లి కూడా తమ లైఫ్



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

టిడ్కో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

పెండింగ్‌లో ఉన్న బ్యాంకు రుణాల మంజూరు, నిధుల విడుదలపై ప్రత్యేక దృష్టి సారించాలి

లబ్ధిదారులకు ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి

ప్రతి పది రోజులకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



నంది పత్రిక కర్నూలు బ్యూరో : టిడ్కో గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి ఆదేశించారు. బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు మంజూరు కావాల్సిన రుణాల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిం చాలని సూచించారు.గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, టిడ్కో మెప్మా, సంబంధిత శాఖల అధికారులతో టిడ్కో గృహ నిర్మాణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో టిడ్కో గృహ పథకం కింద కేటగిరీ-2, కేటగిరీ-3లో మొత్తం 6,112 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరిలో 3,619 మంది లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు విడుదలయ్యాయని, మరో 2,493 మంది లబ్ధిదారులకు సంబంధించి రుణాల మంజూరు, విడుదల ప్రక్రియ పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా ఇప్పటికే రుణాలు పొందిన కొంతమంది లబ్ధిదారులకు పాక్షికంగా మాత్రమే నిధులు విడుదలయ్యాయని, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరితగతిన విడుదల చేసేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం), సంబంధిత బ్యాంకు మేనే జర్లతో సమన్వయం చేసు కొని పరిష్కరించాలన్నారు. బ్యాం కుల ద్వారా తిరస్కరణకు గురైన దరఖాస్తులను మరో సారి క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన పత్రాలు, వివరాల్లో లోపాలను సరిచేసి తిరిగి సమర్పించాలని సూచిం చారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి రుణ సదుపా యం కల్పించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అదేవిధంగా టిడ్కో గృహ సముదాయాల్లో విద్యుత్ సౌకర్యాలు, అవసరమైన విద్యుత్ పాయింట్లు, విద్యుత్ పోల్స్ ఏర్పాటు తదితర పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. చేపట్టిన పనులకు సంబంధించి మెజర్‌మెంట్ బుక్ (ఎంబీ) రికార్డులను త్వరితగతిన పూర్తి చేసి, పనుల పురోగతికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. గృహ సముదాయాల్లో పాఠశాల భవనాలు, ఇతర సామాజిక మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకొని, చేపట్టాల్సిన పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల నిర్మాణ పురోగతి, బ్యాంకు రుణాల మంజూరు, నిధుల విడుదల, విద్యుత్ సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పనపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి, సాధించిన పురోగతిని, పెండింగ్ సమస్యలను సమీక్షించాలని నిర్ణయించారు. తదుపరి సమీక్షా సమావేశానికి మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌డీఎం, సంబంధిత బ్యాంకు మేనేజర్లు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పరంగా అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, గృహ సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని మౌలిక వసతుల పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, టిడ్కో ఎస్.ఈ ఆది నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవి కుమార్ గుప్తా, సి. ఎల్. టి. సి డాక్టర్ పెంచులయ్య, మధు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం



మహానంది, నవంబర్ 06 (నంది పత్రిక):- మహానంది పుణ్యక్షేత్రంలో మహా వైభవంగా ప్రదోషకాల నందీశ్వరాభిషేకం నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భాలయం ఎదురుగా కొలువైన నందీశ్వరునికి ప్రదోషకాలంలో విశేష పూజలు నిర్వహించారు.ముందుగా వేదపండితులు, అర్చకులు నందీశ్వరునికి గణపతి పూజ, పుణ్యాహవాచనం , పంచామృత పూజలు అనంతరం పీఠార్చన, అథాంగ పూజ, ఉపదేవతారాధన,వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో విశేష ద్రవ్యభిషేకం,అలంకార,హారతి పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నరకాసుర సంహార గాథతో ముడిపడిన ప్రాచీన పుణ్యక్షేత్రంశ్రీ పృథ్వీశ్వ రాలయం

బొల్లు రామమోహన్.



కడప నవంబర్ 6 (నంది పత్రిక రిపోర్టర్)"చరిత్రను మరచిన జాతి తన మూలాలను కోల్పోతుంది.. వారసత్వాన్ని కాపాడిన జాతి తన వైభవాన్ని నిలుపుకుంటుంది!"దీపావళి అనగానే దీపాల వెలుగులు, బాణసంచా సందడి, లక్ష్మీపూజలు గుర్తుకొస్తాయి. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను దేశమంతటా జరుపుకుంటారు. ముఖ్యంగా నరకాసుర సంహారాన్ని స్మరించుకుంటూ నరక చతుర్దశి, దీపావళి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. అయితే ఈ పండుగకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన స్థలపురాణాన్ని తనలో దాచుకున్న ప్రాచీన గ్రామం మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండటం విశేషం. అదే కృష్ణా జిల్లా నడకుదురు.

నరకాసుర సంహారంతో ముడిపడిన గ్రామం

విజయవాడ నుంచి అవనిగడ్డ వెళ్లే కృష్ణానది కరకట్ట మార్గంలో సుమారు 50 కిలోమీటర్ల దూరంలో నడకుదురు గ్రామం ఉంది. ఈ గ్రామానికి పూర్వం 'నరకాసుర సంహార క్షేత్రం' అనే పేరు ఉండేదని, కాలక్రమంలో నరకొత్తూరుగా, అనంతరం నడకుదురుగా రూపాంతరం చెందిందని స్థానిక స్థలపురాణం చెబుతోంది. పచ్చని పొలాలు, అరటి తోటలు, కృష్ణానది పరివాహక ప్రాంతపు ప్రకృతి అందాల మధ్య ఉన్న ఈ గ్రామం ఆధ్యాత్మికంగానూ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ వెలసిన శ్రీ పృథ్వీశ్వరాలయం గ్రామ చారిత్రక, పురాణ వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది.

సత్యభామ ప్రతిష్ఠించిన పృథ్వీశ్వరుడు!

పురాణ కథనం ప్రకారం నరకాసురుడు భూదేవి కుమారుడు. తన అహంకారం, దుష్టప్రవర్తనతో దేవతలను, ప్రజలను బాధించడంతో అతని ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని శ్రీకృష్ణుడు సంకల్పిస్తాడు. శ్రీకృష్ణుని సహకారంతో సత్యభామ నరకాసురుడిని సంహరించినట్లు పురాణగాథ వివరిస్తుంది.సత్యభామను భూదేవి అంశగా భావించే సంప్రదాయం ఉంది. నరకాసుర సంహారం అనంతరం సత్యభామాదేవి ఈ ప్రాంతానికి వచ్చి శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించిందని స్థానిక స్థలపురాణం చెబుతోంది. భూమాతకు సంబంధించిన ఈ పురాణ నేపథ్యం కారణంగా ఇక్కడి పరమశివుడిని 'శ్రీ పృథ్వీశ్వరుడు'గా పిలుస్తారని భక్తుల విశ్వాసం.

శైవవైష్ణవ సంప్రదాయాల సంగమం

ఈ ఆలయ సమీపంలో శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహం కూడా దర్శనమిస్తుంది. నరకాసుర సంహార గాథలో ప్రధాన పాత్ర పోషించిన శ్రీకృష్ణుడు, ఆ తరువాత సత్యభామ ప్రతిష్ఠించినట్లు చెప్పబడే పృథ్వీశ్వరుడు.. ఇలా ఒకే క్షేత్రంలో శైవ, వైష్ణవ సంప్రదాయాల అనుబంధం కనిపించడం విశేషం.శివకేశవుల మధ్య భేదం లేదనే భారతీయ ఆధ్యాత్మిక భావనకు ఈ క్షేత్రం ఒక చక్కని ఉదాహరణగా భావించవచ్చు. భక్తి మార్గాలు వేరైనా దైవతత్వం ఒక్కటేననే సందేశం ఇక్కడి ఆరాధనా సంప్రదాయంలో ప్రతిఫలిస్తుంది.

దీపావళి పండుగకు నడకుదురు ప్రత్యేకత

నరకాసుర సంహారం అనంతరం ప్రజలు ఆనందంతో దీపాలు వెలిగించి విజయోత్సవం జరుపుకున్నారనే పురాణ సంప్రదాయం దీపావళి పండుగకు ఆధ్యాత్మిక నేపథ్యంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో నరకాసుర సంహారంతో ముడిపడిన నడకుదురు స్థలపురాణం ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తుంది. అయితే దీపావళి తొలిసారిగా ఈ గ్రామంలోనే ప్రారంభమైందని నిర్ధారించే చారిత్రక ఆధారాలు ఉన్నాయని చెప్పలేం. నడకుదురుకు ఆ గౌరవాన్ని ఆపాదించే స్థానిక విశ్వాసం, స్థలపురాణం మాత్రం ఈ గ్రామానికి ఒక ప్రత్యేక గుర్తింపును అందిస్తున్నాయి.

వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత

మన రాష్ట్రంలో ఎన్నో పురాతన దేవాలయాలు, వాటి వెనుక ఎన్నో ఆసక్తికరమైన స్థలపురాణాలు ఉన్నాయి. వాటిని వెలుగులోకి తీసుకురావడం, ఆలయాల చరిత్రను పరిశోధించడం, శాసనాలు, నిర్మాణశైలులు, స్థానిక సంప్రదాయాలను నమోదు చేయడం నేటి తరానికి అవసరం.

నడకుదురు శ్రీ పృథ్వీశ్వరాలయం కూడా మరింత పరిశోధనకు, పర్యాటక ప్రాచుర్యానికి, ఆధ్యాత్మిక గుర్తింపునకు అర్హమైన క్షేత్రం. సంబంధిత చారిత్రక ఆధారాలను సేకరించి, ఆలయ విశిష్టతను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

"దీపం వెలిగితే ఇల్లు ప్రకాశిస్తుంది.. చరిత్ర వెలుగులోకి వస్తే జాతి వైభవం ప్రకాశిస్తుంది!"

నరకాసురుడిపై సత్యభామ సాధించిన విజయాన్ని గుర్తుచేసే దీపావళి వేళ నడకుదురు వంటి ప్రాచీన క్షేత్రాలను స్మరించుకోవడం మన సంస్కృతిపై మనకున్న గౌరవానికి నిదర్శనం. పురాణ గాథలను విశ్వాసంతో గౌరవిస్తూ, చారిత్రక వాస్తవాలను పరిశోధనతో వెలికితీస్తూ మన వారసత్వ సంపదను కాపాడుకుందాం. నడకుదురు కేవలం ఒక గ్రామం కాదు.. పురాణ విశ్వాసం, ఆధ్యాత్మిక వారసత్వం కలగలిసిన ఒక విశిష్ట పుణ్యభూమి!

వికసిత్ భారత్ 2047 యువతే కీలకం

డాక్టర్ పసుపులేటి శంకర్



కడప నవంబర్ 6 (నంది పత్రిక రిపోర్టర్) భారత దేశం 2047 నాటికీ ప్రపంచములో అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరేందుకు యువత పాత్ర చాలా కీలకమైందని శ్రీ సరస్వతి విద్యా పీఠం కడప విభాగ్ ఉపాధ్యక్షులు మైదుకూరు స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. భారత ప్రభుత్వ కేంద్ర యువజన మరియు క్రీడల శాఖకు చెందిన మై భారత్ కేంద్రం ఆధ్వర్యంలో భారత వికసిత్ 2047 కార్యక్రమం చాపాడు మండలం సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగింది.కడప జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ఆంగ్లేయులు మన దేశాన్ని పరిపాలించక ముందు ప్రపంచములో మన దేశ జిడిపి 30 శాతం ఉండేదన్నారు. నేటి యువత అన్ని రంగాలలో రాణించి అద్భుతాలు సృష్టించవలసిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలుగా గుర్తింపు పొందిన ప్రపంచములోని అన్ని దేశాలలో వృద్ధుల శాతం అధికమన్నారు. మన భారత దేశంలో ఉన్న యువత అధిక్యం ఏ దేశములో లేదని ఈ యువత అధిక్యం మన దేశములో 2065 సంవత్సరం వరకు ఉంటుందని మన గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రపంచ యుద్ధంలో నాశనమైన జర్మనీ ఆ దేశ ప్రజల కఠోర శ్రమ కారణంగా నేడు ప్రపంచములో బలీయంగా ఉందన్నారు. 2047 నాటికీ భారత దేశానికి స్వాతంత్ర్యము వచ్చి 100 సంవత్సరాలు అయ్యే సందర్భంగా తలపెట్టిన వికసిత్ భారత్ విజయానికి భారతీయులమందరమూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు చేయాలనే ఆలోచన నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. కార్మిక, కర్షక, విద్యా, ఉద్యోగ ఇతర అన్ని రంగాలలో వృత్తి నైపుణ్యం పెంపొందించుకున్ననాడు మన దేశ త్రివర్ణ పతాకం అత్యున్నత స్థాయిలో ఎగరడం కాక ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుతుందన్నారు. నేటి యువత ఆలోచనలు సముద్రము కన్నా పెద్దగా, గాలి కన్నా వేగంగా పరుగులు తీయాలన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం కోసం ప్రతి భారతీయుడు శ్రమించిన నాడు భారత రత్నాల వంటి వారు వెలుగులోకి వస్తారన్నారు. ఒకే దేశము ఒకటే ఎన్నిక అనే అంశము గురించి కడప జిల్లా స్థాయి నుంచి వచ్చిన యువతకు డాక్టర్ శంకర్ మార్గనిర్దేశనం చేశారు. న్యూ ఢిల్లీలోని భారత పార్లమెంటులో ప్రసంగించే అవకాశం పొందేలా యువత సాధన చేయాలన్నారు. జిల్లా స్థాయిలో గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయిన ముగ్గురికి పారితోషికము ప్రశంసా పత్రాలు అందించారు.

బనగానపల్లె లో ప్రజాదర్బార్

క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని కోయిలకుంట్ల మండల రైతుల విజ్ఞప్తి



బనగానపల్లె నవంబర్ 6నందిపత్రిక బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని నియోజకవర్గంలోని నాలుగు మూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా విన్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇందులో భాగంగా కోయిలకుంట్ల మండలానికి చెందిన రైతులు మంత్రిని కలిసి మండలంలో సాగునీటి ఎద్దడి నెలకొన్న నేపథ్యంలో పంటలకు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి విడుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రైతుల విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.



మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ



మహానంది, నవంబర్ 06 (నంది పత్రిక):- మహానంది క్షేత్రంలో వైభవంగా పల్లకి సేవ నిర్వహించారు. శుక్రవారం సంద ర్భంగా ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు,అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.ముందుగా శ్రీ కామేశ్వరి సహిత మహానందీశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పల్లకిలో ఆశీనులు గావించి,విశేష పూజలు చేపట్టారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు విరాళం



బనగానపల్లె నవంబర్ 6 నందిపత్రిక నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం కు శుక్రవారం కడప జిల్లా, ఖాజీపేట వాస్తవ్యులు ఉప్పు విశ్వనాథ్ వారి ధర్మపత్ని ఉమ్మడి శెట్టి పూజ వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ. 25,116 విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

జడ్పీటీసి, ఎంపిటీసి ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం

నేటి ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

జిల్లాలో 3 రెవెన్యూ డివిజన్లలో

6 లొకేషన్ లలో జరగనున్న కౌంటింగ్

జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి

నంది పత్రిక కర్నూలు బ్యూరో : స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా జడ్పీటీసి, ఎంపిటీసి ఎన్నికల కౌంటింగ్ కోసం సర్వం సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ / జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జడ్పీటీసి, ఎంపిటీసి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ రేపు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. జిల్లా యంత్రంగా ఆధ్వర్యంలో కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి మొత్తం 431 కౌంటింగ్ టేబుల్ లను ఏర్పాటు చేశామని, 515 మంది కౌంటింగ్ సూపర్వైజర్ లను, 1545 మంది కౌంటింగ్ అసిస్టెంట్ లను మొత్తం 2060 మంది సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో 3 రెవెన్యూ డివిజన్లలో 6 లొకేషన్ లలో కౌంటింగ్ జరగనుందన్నారు.జిల్లాలో జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించి కర్నూలు నగరం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), బి-క్యాంప్ లో సి.బెళగల్, కల్లూరు, వెల్దుర్తి, కోడుమూరు, కృష్ణగిరి మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు చేయనున్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాలలో గూడూరు , కర్నూల్, ఓర్వకల్ మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దేవనకొండ, మద్దికేర , పత్తికొండ, తుగ్గలి మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరగనుందన్నారు.ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదోని -1,2 , కోసిగి, కౌతాళం, మంత్రాలయం, పెద్దకడబూరు మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.ఆలూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హోళగుంద మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగు తుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎమ్మిగనూరు లో గోనెగండ్ల నందవరం ఎమ్మిగనూరు మండలాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు అత్యంత పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.



అనంతపురం అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి





ప్రజల నమ్మకాన్ని మరింతగా నిలబెట్టుకోండి

డివిజన్ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావాలి

అవినీతి వ్యవహారాలు, వివాదాలకు దూరంగా ఉండండి

పదవులంటే అలంకారం కాదు..

సేవ చేసే అవకాశం

వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచన

అనంతపురం బ్యూరో చీఫ్, నవంబర్ 6 నంది పత్రిక అనంతపురం నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు, అనంతపురం నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. శుక్రవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నికైన రమేష్‌గౌడ్‌తో పాటు కార్పొరేటర్లుగా గెలిచిన, ఓడిపోయిన అభ్యర్థులు, స్థానిక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంతి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ అర్పించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడం వెనుక ప్రతి ఒక్కరి కష్టం ఉందన్నారు. అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలు చేసినా భయపడలేదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. ఓటమికి ఎవరూ చింతించాల్సిన అవసరం లేదని, మనమంతా బలంగా నిలబడడం వల్లే మేయర్ స్థానాన్ని గెలుచుకోగలిగామని తెలిపారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీలను నిలబెట్టుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారంతా ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు. అవినీతికి తావులేకుండా అనంతపురం నగరాన్ని ప్రశాంతంగా ఉంచడమే మన ముందున్న ప్రథమ కర్తవ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో దాడులు, దౌర్జన్యాలు, భూకబ్జాలు ఎక్కువయ్యాయన్నారు. ప్రజలు అన్నింటినీ గమనించే వైసీపీకి పట్టం కట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అనంతపురం కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజలకు సేవ చేసే అవకాశం అందరికీ రాదని, వచ్చిన అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేయర్, కార్పొరేటర్ పదవులు అంటే అధికారం చలాయించడానికి కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశాలు అని తెలియజేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే ఆలోచిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వీలైంత వరకు డివిజన్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. మేయర్‌గా గెలిచిన రమేష్ గౌడ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పని చేసి అనంతపురం నగరాన్ని సుందరమైన, స్వచ్ఛమైన నగరంగా తీర్చిదిద్దుదామన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని తెలిపారు. తనను మేయర్‌గా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లాలో ఆక్వారంగానికి విద్యుత్ పునరుద్ధరీకరణ.





పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి.

ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి.

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, బ్యూరో చీఫ్ నవంబర్6 నంది పత్రిక. ఆర్నబ్ తుఫాను కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం వశిష్ట సమావేశ మందిరంలో ఆక్వా రంగానికి విద్యుత్ పునరుద్ధరణ పై ఆక్వా అసోసియేషన్ రైతులు, విద్యుత్, మత్స్య శాఖ అధికారులతో ఎపిఎస్ పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి,

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఆర్నబ్ తుఫాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ సరఫరా ను యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి జిల్లా వ్యాప్తంగా గృహాలు, ఆక్వా, వ్యవసాయ రంగాలకు సంబందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించటం జరిగిందని అన్నారు. ఇంకా సిబ్బంది, పరికరాలు చేరావేయటానికి ఇబ్బంది కర ప్రాంతాలలో కూడా విద్యుత్ పునరుద్ధరణ త్వరలోనే పూర్తి చేయటం జరుగుతుందని అన్నారు.. జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, గృహ విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు తెలిపారు.జిల్లాలో తుపాను ప్రభావానికి గురైన 98 విద్యుత్ ఉపకేంద్రాల్లో పునరుద్ధరణ పనులు 100 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ప్రభావితమైన 67, 33 కేవీ విద్యుత్ లైన్లలో 66 లైన్లను పునరుద్ధరించగా, మిగిలిన ఒక లైన్ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. అదేవిధంగా 475 ,11 కేవీ విద్యుత్ లైన్లలో 473 లైన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. మిగిలిన రెండు లైన్లను కూడా త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించడం, విద్యుత్ లైన్లపై పడిన చెట్లను తొలగించడం, కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం వంటి పనులను భారీ స్థాయిలో చేపట్టామన్నారు. జిల్లాలో తుపాను ప్రభావానికి గురైన ఆరు విభాగాలు, 20 మండలాల్లోని 409 గ్రామాల్లో గృహ విద్యుత్ సరఫరాను 100 శాతం పునరుద్ధరించినట్లు వెల్లడించారు. జిల్లాలో 17,584 ప్రభావిత ఆక్వా విద్యుత్ సర్వీసులకు గాను 16,809 సర్వీసులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని, మిగిలిన 775 ఆక్వా సర్వీసులతో పాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా త్వరలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.జిల్లావ్యాప్తంగా 226 బృందాలకు చెందిన 3,254 మంది అధికారులు, విద్యుత్ సిబ్బంది నిరంతరం పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. తుపాను కారణంగా విద్యుత్ రంగానికి ప్రాథమిక అంచనా ప్రకారం రూ.50.49 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్తలు, సమన్వయ చర్యల కారణంగా ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి గృహ విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించారని సీఎండీ తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అర్నబ్ తుపాను ప్రభావానికి జిల్లాలో విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ, విద్యుత్, ఇతర శాఖల సమన్వయంతో త్వరితగతిన విద్యుత్ లైన్ల పునరుద్ధరీకరణ చేయటం జరిగిందని తెలిపారు. తుపాను సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది చూపిన సమన్వయం, సమర్థవంతమైన పనితీరు అభినందనీయమని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేశారని అన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డైరెక్టర్ సూర్య ప్రకాష్, ఎస్ఈ పి ఉషారాణి, ఆక్వా అసోసియేషన్ సభ్యులు, మత్స్యశాఖ డిడి శ్రీనివాసరావు, పాల్గొన్నారు..



యండగండి లాకులను పరిశీలించి, వరద పరిస్థితిపై ప్రజలతో మాట్లాడిన జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ






ఉండి బ్యూరో నవంబర్ 6 నంది పత్రిక ఉండి మండలం యండగండి గ్రామంలో ఉన్న లాకులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వరద పరిస్థితులు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. వరద నీటి ప్రవాహం, లాకుల పరిస్థితిని నిరంతరం గమనిస్తూ అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ సిబ్బందికి, తహసీల్దార్‌కు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



భీమవరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు శ్రీ కొటికలపూడి గోవిందరావు (చినబాబు) గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏలూరు నగర మేయర్ శ్రీ రెడ్డి అప్పలనాయుడు గారు, జనసేన నాయకులు శ్రీ నారా శేషు గారు..



భీమవరం, నవంబర్ 06:- ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 44,661 ఓట్ల భారీ మెజారిటీతో ఏలూరు నగర మేయర్‌గా ఎన్నికైన జనసేన పార్టీ అభ్యర్థి శ్రీ రెడ్డి అప్పలనాయుడు గారు, శుక్రవారం జనసేన నాయకులు శ్రీ నారా శేషు గారితో కలిసి భీమవరంలో జనసేన జిల్లా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు శ్రీ కొటికలపూడి గోవిందరావు (చినబాబు) గారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.. ఈ సందర్భంగా శ్రీ రెడ్డి అప్పలనాయుడు గారిని జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) గారు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.. ఏలూరు నగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నూతన మేయర్‌గా బాధ్యతలు చేపట్టనున్న శ్రీ రెడ్డి అప్పలనాయుడు గారు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగర పాలన సాగాలని కోరారు.. ఈ సందర్భంగా శ్రీ కొటికలపూడి గోవిందరావు (చినబాబు) గారిని, ఏలూరు మేయర్ రెడ్డి అప్పలనాయుడు గారిని, జనసేన నాయకులు నారా శేషు గారిని భీమవరం నియోజకవర్గం జనసేన ముఖ్య నాయకులు, తదితరులు సత్కరించి అభినందించారు.. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు పాల్గొన్నారు..



తాడేపల్లిగూడెంలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ

తాడేపల్లిగూడెం బ్యూరో చీఫ్ నవంబర్ 6 పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తాడేపల్లిగూడెం డివిజన్‌కు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, కౌంటింగ్ హాళ్లలో చేపట్టిన మౌలిక సదుపాయాలు, ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి...



జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 6 నందిపత్రిక భీమవరం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు. అందరి సమన్వయంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించగలిగామని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో, రాబోయే పంచాయతీ ఎన్నికలు కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ ఎన్నికల నిర్వహణకు సహకరించాలన్నారు. రేపు 7 వ తేదీ శనివారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం కొన్నిచోట్ల బాణసంచా కాల్చడం, భారీగా సంబరాలు నిర్వహించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున, రేపు జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు సందర్భంగా, అలాగే భవిష్యత్తులో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలోనూ బాణసంచా కాల్చడం, భారీ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటికి అనుమతి లేదని స్పష్టం చేశారు.ఎన్నికల ఫలితాల అనంతరం ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ ఎన్నికల నిర్వహణ సమయంలో జిల్లాలో రెండు తుపాన్లు, భారీ వర్షాలు, వరదల కారణంగా అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు. అత్తిలి, కాసిపాడు, ఉయ్యూరు, నందమూరిగురువు, దువ్వ, తణుకు తదితర ప్రాంతాల్లో వరద పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ఒకవైపు సహాయక చర్యలు, మరోవైపు ఎన్నికల నిర్వహణ బాధ్యతలను అధికారులు సమన్వయంతో నిర్వర్తించారని ప్రశంసించారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అంకితభావంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో డి ఆర్ వో పీ గ్లోరియా, కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి ప్రభాకర్, ఎలక్షన్ సూపర్టెండెంట్ శేఖర్,కాంగ్రెస్ పార్టీ నుంచి పి రత్నరాజు, ఎన్ కృష్ణ మురళి, బివివి సత్యనారాయణమూర్తి, వైఎస్ఆర్సిపి పార్టీ నుంచి రామరాజు, జనసేన పార్టీ నుంచి జై శివ, టిడిపి పార్టీ నుంచి ఎం శ్యాంబాబు,



అర్నబ్ తుఫాను ప్రభావిత కుటుంబాలకు ప్రత్యేక రేషన్ పంపిణీ.

జిల్లా జాయింట్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ



తాడేపల్లిగూడెం బ్యూరో చీఫ్ నవంబర్ 6 నంది పత్రిక పశ్చిమగోదావరి జిల్లాలో అర్నబ్ తుఫాను కారణంగా తీవ్రంగా ప్రభావితమైన కుటుంబాలకు ప్రత్యేక రేషన్ అందజేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తెలిపారు.జిల్లాలో మొత్తం 5 లక్షల 63 వేల తెల్ల రేషన్ కార్డులు ఉండగా, తుఫాను కారణంగా తీవ్రంగా ప్రభావితమైన 53 వేల మంది రేషన్ కార్డుదారులకు ప్రత్యేక రేషన్ కిట్ అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ పంచదార, ఒక లీటర్ పామాయిల్, ఒక కేజీ ఉల్లిపాయలు, ఒక కేజీ బంగాళాదుంపలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా జాయింట్ కలెక్టర్ తాడేపల్లిగూడెం మండలంలోని, అరుళ్ల గ్రామాల్లో పర్యటించి పలువురు రేషన్ కార్డుదారులకు ప్రత్యేక రేషన్ సరుకులను పంపిణీ చేశారు.చేనేత కార్మికులు, మత్స్యకారులకు ప్రత్యేకంగా 50 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక కేజీ పంచదార, ఒక లీటర్ పామాయిల్, ఒక కేజీ ఉల్లిపాయలు, ఒక కేజీ బంగాళాదుంపలు అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. మిగిలిన 5 లక్షల 10 వేల రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 10 కేజీల బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఆమె వివరించారు.



తుఫాను ప్రభావిత కుటుంబాలకు పంపిణీ చేయనున్న రేషన్ సరుకుల నిల్వలు, నాణ్యతను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ





నరసాపురం బ్యూరో చీఫ్ నవంబర్ 6 నంది పత్రిక అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలకు పంపిణీ చేయనున్న రేషన్ సరుకుల పంపిణీపై జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులతో సమీక్ష నిర్వహించి సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియలో అర్హులైన ప్రతి కుటుంబానికి సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని, పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నరసాపురంలోని బఫర్ గోడౌన్‌లో తుఫాను ప్రభావిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు నిల్వ ఉంచిన రేషన్ సరుకులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. గోడౌన్‌లో అందుబాటులో ఉన్న సరుకుల నిల్వలను, వాటి నాణ్యతను తనిఖీ చేశారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, నిర్దేశించిన పరిమాణంలో సరుకులను లబ్ధిదారులకు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో దాసిరాజు, డిఎస్ఓ ఎన్ సరోజ, ఏఎస్ఓ రవిశంకర్ తదితరులు ఉన్నారు.





ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వరద బాధితుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపులు





భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్6 నంది పత్రిక పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల కురుస్తున్న ముసురు తుఫాను వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా పెనుమంట్ర మరియు వేల్పూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఆయన ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాధితులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వైద్యాధికారులు మరియు ఆరోగ్య సిబ్బందికి పలు కీలక సూచనలు జారీ చేశారు: నిరంతర వైద్య సేవలు: ముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా నిరంతరం మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, అవసరమైన అన్ని రకాల అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వ్యాధుల నివారణ చర్యలు:

దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి తీవ్ర జ్వరాలు మరియు నీటి ద్వారా వచ్చే అతిసారం (డయేరియా) రాకుండా క్లోరినేషన్ మరియు బ్లీచింగ్ పౌడర్ పిచికారీ నిరంతరం చేపట్టాలని సూచించారు. తాగునీటి శుద్ధి: ప్రతి గ్రామంలో తాగునీటి నిల్వలను తనిఖీ చేసి, క్లోరినేషన్ చేసిన సురక్షితమైన నీటినే ప్రజలు తాగేలా చైతన్యపరచాలని తెలిపారు.

అత్యవసర రవాణా: గర్భిణులు, బాలింతలు, మరియు వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు లేదా ఆసుపత్రులకు తరలించడానికి 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.“వర్షాలు, పూడిక నిల్వల వల్ల ఎదురయ్యే ఎలాంటి ఆరోగ్య అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వైద్య శాఖ పూర్తి సన్నద్ధంగా ఉంది. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప మెడికల్ క్యాంప్‌ను సంప్రదించాలి“ అని జిల్లా వైద్యాధికారి విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఏ. చక్రపాణి యాదవ్ చేసిన సేవలు చిరస్మరణీయం

ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి, రాజకీయ రంగానికి తీరని లోటు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జెంగీటీ లక్ష్మీనరసింహా యాదవ్



కర్నూలు సిటీ నంది పత్రిక శాసనమండలి మాజీ చైర్మన్, సీనియర్ రాజకీయ నాయకులు ఏ. చక్రపాణి యాదవ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీకి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి జెంగీటీ లక్ష్మీనరసింహా యాదవ్ అన్నారు. శుక్రవారం కర్నూలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏ. చక్రపాణి యాదవ్ చిత్రపటానికి ఏఐసీసీ సభ్యుడు ఎం. సుధాకర్ బాబు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు, జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జెంగీటీ లక్ష్మీనరసింహా యాదవ్ మాట్లాడుతూ.. చక్రపాణి యాదవ్ మృతి ప్రస్తుత రాజకీయ రంగానికే కాకుండా, శాసన వ్యవస్థకు కూడా తీరని లోటని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు, సభా వ్యవహారాల నిర్వహణలో చూపిన అనుభవం, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయనకున్న అంకితభావం చిరస్మరణీయమని కొనియాడారు.సమైక్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగారని గుర్తుచేశారు. 1976 నుంచి 1985 వరకు శాసనమండలి సభ్యుడిగా, డిప్యూటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అనంతరం కర్ణాటక కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా, ఏపీసీసీ సమన్వయకర్తగా కీలక బాధ్యతలు చేపట్టారని వివరించారు.2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో శాసనమండలి పునరుద్ధరణ జరిగిన అనంతరం ఏపీ శాసనమండలి చైర్మన్‌గా ఎన్నికై, సుమారు పదేళ్లపాటు ఆ పదవిలో కొనసాగారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు విభజిత ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు రాజకీయ చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందాయని అన్నారు.ఈ సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున ఏ. చక్రపాణి యాదవ్‌కు ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని నరసింహ యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యు వెంకటన్న, కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఏ సూర్య ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాఘాకృష్ణ, ఐఎన్టియుసి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సయ్యద్ ఖాద్రి పాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కే రాఘవేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మాలిక్ భాష, ఎం సోల్ రాజ్, యు శేషయ్య విజయభాస్కర్ రంగస్వామి మొదలగువారు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఆరోగ్యానికి హానికరం

కర్నూల్ సిటీ నందిపత్రికకర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు, ఆసుపత్రిలో నిర్వహిస్తున్న “బ్రిక్స్ సస్టైనబుల్ లైఫ్ స్టైల్ వీక్“ లో భాగంగా నేడు “రెడ్యూస్ ఈ-వేస్ట్“ (ఈ-వ్యర్థాల తగ్గింపు) అనే అంశంపై అవగాహన కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి మరియు ఆరోగ్యానికి కలిగే నష్టాలపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆసుపత్రిలోని వివిధ కార్యాలయ ప్రాంగణాల్లో ప్రత్యేక అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు. అంతేకాకుండా ఆసుపత్రిలో ఉపయోగంలో లేని, పాడైపోయిన పాత ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించడానికి ప్రత్యేకంగా ఈ-వ్యర్థాల సేకరణ డ్రైవ్ (ఈ-వేస్ట్ కలెక్షన్ డ్రైవ్) నిర్వహించారు. ఆసుపత్రి ఫెసిలిటీ మేనేజర్ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఎస్.ఆర్.యం.ఓ డా పి.పద్మజ డిప్యూటీ సి.ఎస్.ఆర్.యం.ఓ వి. పద్మజ , ఆసుపత్రి ఉద్యోగులు, అధికారులు మరియు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ఎవరైనా అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవు

కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

కర్నూలు సిటీ నందిపత్రిక జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా అటువంటి వారి పై ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపిసి సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ శుక్రవారం తెలిపారు. కర్నూలు , ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్ లలో టపాసుల విక్రయాలు జరిగే ప్రాంతాలలో పలు జాగ్రత్తలు, సూచనలు పాటించాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు ఆదేశించారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విక్రయించాలని విక్రయదారులకు తెలియజేయాలన్నారు.

చట్టం సూచించిన నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు.

కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసుల విక్రయాలు చేయాలన్నారు.

నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రి



తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

చిన్న పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు.

లైసెన్స్ లు కల్గిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా , అనుమతులు లేకుండా దీపావళి మందు గుండు సామాగ్రి కలిగి ఉన్నా, తయారుచేసినా లేదా అనధికార ప్రదేశాలలో నిల్వ ఉంచినా , విక్రయాలు జరిపినా అటువంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. టపాసుల దుకాణాల వద్ద అగ్నిమాపక వాహనాన్ని, అంబులెన్స్ వాహనాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పని చేసి దీపావళి పండుగ సజావుగా నిర్వహించే విధంగా చూసుకోవాలన్నారు.

దీపావళి పర్వదినం రోజున జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు.

టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ - 112 లేదా డయల్ 100 కి గాని లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు గాని సమాచారం అందించాలని, సమాచారం చేరవేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మట్టిలో మాణిక్యాలు

క్రీడల్లో దూసుకుపోతున్న విజ్ఞాన సుధ పాఠశాల విద్యార్థులు

నెట్ బాల్, కరాటేలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు



కర్నూలు సిటీ నంది పత్రిక విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ కర్నూలు నగరం, ముజఫర్ నగర్ విజ్ఞాన సుధ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. మైదానంలో అద్భుతమైన ఆటతీరుతో నెట్‌బాల్ అండర్ -14, 17, 19 విభాగాలలో కరాటేలోనూ అసాధారణ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచారు. పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. చిన్న వయస్సులోనే విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా ఉపాధ్యాయులు శ్రీరాములు రాజశేఖర్ మాట్లాడుతూ ముజఫర్ నగర్ ప్రాంతంలో రోజు వారి పనులతో జీవనం సాగిస్తున్న రంజిత్ కుమార్, బి కుసుమల కుమారుడు బి శరత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కరాటే అండర్ - 17లో మా స్టర్ ఈ గీతావాణి వద్ద శిక్షణ సాగిస్తున్నాడు ఎస్ షేక్షావలి, ఎస్ షహనాజ్ ల కుమారుడు ఎస్ అక్బర్ ఫరూక్ 9వ తరగతి చదువుతున్నాడు. ఇతను నెట్ బాల్ అండర్ -19 ఈ భాగంలో ఖాసీం సాహెబ్, షాహిన్ బీల కుమారుడు మతిన్ 7వ తరగతి చదుతున్నాడు. ఇతను నెట్ బాల్ అండర్ - 17 విభాగంలో, డి కన్నయ్య, డి కళ్యాణిల కుమారుడు డి చేతన్ కుమార్ 9వ తరగతి చదుతున్నాడు. ఇతను నెట్ బాల్ అండర్ - 19 ఈ భాగంలో వీరు పిఈటీ మాస్టర్ రాజశేఖర్ వద్ద శిక్షణ తీసుకున్నారు. ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. విద్యార్థులను కరెస్పాండెంట్ కె వి గౌతమ్ కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు కె రాజేశ్వరిలు అభినందనలు తెలిపినట్లు చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదుగుతారనడానికి ఈ విద్యార్థుల ప్రతిభ నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి అభివృద్ధికి పాటుపడేవిధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించి,భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి నాగేంద్ర, ఎస్ షబీర బాను, కె జయంతి పాల్గొన్నారు.

1,875 మంది పోలీసులతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

జిల్లావ్యాప్తంగా 6 కేంద్రాల్లో కౌంటింగ్.

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా.

144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.

ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు,

సభలు, బాణసంచా, డప్పులపై పూర్తి నిషేధం.

కర్నూల్ సిటీ నంది పత్రిక కర్నూలు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 7వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, నిష్పక్షపాత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం తెలిపారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలు మొత్తం 6 ఉన్నాయన్నారు.

జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టిందన్నారు.

1) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బి-క్యాంప్, కర్నూలు .

2) సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల, బి-క్యాంప్, కర్నూలు .3) ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఆదోని .

4) ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు.

5) ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల , ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆలూరు.

6) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పత్తికొండ.

కౌంటింగ్ ప్రక్రియ కోసం ఇద్దరు అడిషనల్ ఎస్పీల పర్యవేక్షణలో 4 గురు డీఎస్పీలు, 40 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలు, 297 మంది ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుళ్లు, 774 పోలీసు కానిస్టేబుల్స్, 90 మంది మహిళా పోలీసులు, 130 మంది ట్రైనీ పోలీసులు, 240 మంది హోంగార్డులు, 8 ప్లాటూన్ ల ఏపీఎస్పీ బలగాలు, స్పెషల్ పార్టీలతో మొత్తం 1,875 మంది పోలీసులను బందోబస్తు విధుల్లో నియమించినట్లు ఎస్పీ తెలిపారు.

సాంకేతిక నిఘా: స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఆధునిక సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపడతామన్నారు.

144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు:

కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయని, ఎవరైనా గుంపులుగా చేరినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజయోత్సవాలపై నిషేధం:

ఫలితాల ప్రకటన అనంతరం ఎలాంటి విజయోత్సవ



ర్యాలీలు, సభలు నిర్వహించడానికి అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చడం, పెద్ద శబ్దాలతో డప్పులు వాయించడంపై పూర్తి నిషేధం విధించినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా గౌరవిస్తూ, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఐదు రెవెన్యూ డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు .....

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి



కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 6 నంది పత్రిక: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఇందులో భాగంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఐదు రెవెన్యూ డివిజన్లలో కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బి.కోడూరు, మైదుకూరు, శ్రీ అవదూత కాశీ నాయన, బి. మఠం, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల మండలాలకు సంబంధించి బద్వేల్‌లోని అంబేద్కర్ గురుకులాన్ని కేంద్రంలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైలవరం, దువ్వూరు, పెద్దముడియం, ప్రొద్దుటూరు మండలాలకు సంబంధించి జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలకు సంబంధించి కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగాల, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాలకు సంబంధించి పులివెందులలోని రమనప్ప సత్రం, జడ్ .పి హై స్కూల్ లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందలూరు, రాజంపేట, టి.సుండుపల్లి, వీరబల్లి మండలాలకు సంబంధించి రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

" సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవీయ విలువలతో మేళవించి ఆదర్శవంతమైన వైద్యులుగా ఎదగాలి"

"నేటి వైద్యవిద్యార్థులే రేపటి సమాజానికి ఆరోగ్య భరోసా"..యువ వైద్యులకు సూచించిన డా.పి.చంద్రశేఖర్, వైస్ చాన్సలర్, డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ

కర్నూలు సిటీ నందిపత్రిక నేటి వైద్యవిద్యార్థులే రేపటి సమాజానికి ఆరోగ్య భరోసా అని అందుకే వారు సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవీయ విలువలతో మేళవించి ఆదర్శవంతమౌన వైద్యులుగా ఎదగాలనీ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా.పి చంద్రశేఖర్ వైద్యవిద్యార్థులకు సూచించారు. శుక్రవారం కర్నూల్ మెడికల్ కాలేజీ లో ఆడిటోరియం యందు 2026 బ్యాచ్ వైద్య విద్యార్థుల కు 2024 బ్యాచ్ విద్యార్థులు "ఉత్కర్ష్2026" పేరుతో ఫ్రెషర్స్ డే నిర్వహించిన సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య విద్యార్థులు అకడమిక్ పరిజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సేవాభావం, రోగుల పట్ల కరుణ, మానవీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని ఉన్నతంగా నిర్దేశించుకుని, నిరంతర అధ్యయనం, కృషి, పరిశోధనలతో ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అడిషనల్ డిఎమ్ఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ కర్నూల్ మెడికల్ కాలేజీకి దేశవ్యాప్తంగా ఎంతో పేరు ఉందని ఇటీవల దేశవ్యాప్తంగా 823 మెడికల్ కాలేజీలలో ఐఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లో 54 స్థానాన్ని సాధించిందని రాష్ట్రంలో కేఎంసి 4వ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. కెఎంసి విద్యార్థులు ఈ పేరును నిలబెట్టాలని కోరారు. వైద్య విద్యార్థులు విద్యా విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎప్పటికప్పుడు సిలబస్ ను పూర్తి చేసుకుంటూ తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలన్నారు. అడిషనల్ డీఎంఈ హాస్పిటల్ సూపరిండెంట్ డా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు రోగుల ఎడల సేవాభావం కలిగి ఉండాలని ముఖ్యంగా ఎక్కువగా రోగుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నం చేయాలని ఈ విషయంలో ఎంత ఓపిగ్గా ఉంటే అంత జ్ఞానాన్ని సాధించగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో 2026 బ్యాచ్ విద్యార్థులకు "వైట్ కోట్ సెర్మని" నిర్వహించడం



జరిగింది ఈ కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సిఎస్ కే ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ హరి చరణ్, డాక్టర్ సింధియా శుభప్రద, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మి,హాస్టల్ వార్డెన్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి శ్యామల వివిధ విభాగాల ప్రొఫెసర్లు అసోసియేట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీనియర్ జూనియర్ విద్యార్థులు ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024 బ్యాచ్ 26 బ్యాచ్ వైద్య విద్యార్థులు సంస్కృతి దేశభక్తి సేవాభావం వైద్యం గొప్పతనం తెలుపుతూ నిర్వహించినసాంస్కృతి కార్యక్రమాలను అహుతులని ఎంతగానో అలంకరించాయి. విద్యార్థులు కేరింతలతో ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్ రేపే.. తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ (పరిషత్) ఎన్నికల ఓట్ల లెక్కింపు శనివారం (నవంబర్ 7) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసింది. ఏకగ్రీవాలు పోగా సుమారు 7,767 ఎంపీటీసీ, 582 జడ్పీటీసీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరగనుంది.

70.72 శాతం పోలింగ్

నవంబర్ 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ జరిగింది. ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు, జడ్పీటీసీ ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లను ఉపయోగించారు. వర్షాలు, వరదల కారణంగా 5 మండలాల్లో, సాంకేతిక సమస్యల వల్ల మరికొన్ని చోట్ల రీపోలింగ్ అవసరమైంది. ఇది నవంబర్ 6న ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన తుది గణాంకాల ప్రకారం మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైంది. విశాఖపట్నం జిల్లా ప్రాంతాల్లో అత్యధికంగా సుమారు 82.51 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా సుమారు 62.01 శాతం పోలింగ్ జరిగింది. ఇతర జిల్లాల్లో శ్రీకాకుళం 65.51, అనకాపల్లి 75.58, చిత్తూరు 76.30, కృష్ణా 73.21 శాతంగా నమోదైంది.

కౌంటింగ్ ఏర్పాట్లు 28 జిల్లాల్లో 365 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,000కు పైగా టేబుళ్లు సిద్ధం చేశారు. 30 వేల నుంచి 40 వేల మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. వీరిలో 11 వేలకు పైగా సూపర్‌వైజర్లు ఉన్నారు. కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు, 144 సెక్షన్ అమలులో ఉంటుంది. భారీ భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు.

లెక్కింపు ప్రక్రియ, ఫలితాల సమయంఉదయం 8 గంటలకు ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాత అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు తెరుస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్లను వేరు చేసి చేతితో లెక్కిస్తారు కాబట్టి ఎక్కువ సమయం పడుతుంది.తొలి అధికారిక ట్రెండ్స్ సుమారు 4 గంటల తర్వాత, అంటే మధ్యాహ్నం లేదా ఆ తర్వాత వెలువడే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఫలితాలు మధ్యాహ్నం 3 గంటల సమయానికి, జడ్పీటీసీ ఫలితాలు సాయంత్రం 7 గంటల సమయానికి వస్తాయని అంచనా. ఒక్కో స్థానం లెక్కింపు పూర్తయ్యే కొద్దీ ఫలితాలు రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది.

జిల్లాలు, మండలాల వారీ ఫలితాలను రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ంవఎ.ఖజూ.స్రశీజ.ఱఅ తో పాటు తెలుగు మీడియా ద్వారా తెలుసుకోవచ్చు.

ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన గూడూరు మున్సిపాలిటీ చైర్మన్ సునీతాబాయి

కర్నూల్ సిటీ నంది పత్రిక



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును గూడూరు మున్సిపాలిటీ చైర్మన్ డమాం సునీతా బాయి మర్యాదపూర్వకంగా కలిశారు... కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి సత్కరించారు..ఈ సందర్భంగా ఎన్నికల్లో తన గెలుపుకు సహకరించిన ఎంపీ నాగరాజుకు సునీతాబాయి కృతజ్ఞతలు తెలిపారు.

"కేఎంసిలో పెరిగిన 19 పిజి మెడికల్ సీట్లు"

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు మెడికల్ కాలేజీ యందు 19 పీజీ సీట్లు పెరిగాయని అడిషనల్ డీఎంఈ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 188 పిజి సీట్లు ఉన్నాయని 19 పెరగడం ద్వారా 207కు చేరాయనిజనరల్ సర్జిరీ, అనస్థీషియా, రేడియాలజీ, పీడియాట్రిక్, రేడియేషన్ ఆంకాలజీ లలో ఈ సీట్లు పెరిగాయని ఎందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతి లభించిందని ఆమె తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పెరిగిన వాటితో పీజీ సీట్లు 207 చేరాయని గతం లో ఉన్న 22 సూపర్ స్పెషాలిటీ సీట్లతో కలిపి మొత్తం 229 కు చేరుకున్నాయని తెలిపారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడం మనందరి బాధ్యత





"మనందరి ప్రియతమ నాయకుడు,కాంగ్రెస్ రక్తం, కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన దామన్న కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి"

మంత్రిఉత్తమ్ కుమార్ రెడ్డి

పట్టభద్రుల వాయిస్ గా నేను ఉంటా

దామన్న బిడ్డను గెలిపిస్తారని కోరుకుంటున్న

సూర్యాపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక రైల్వే లైన్

సూర్యాపేట పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి కావాలంటే రైల్వే లైన్ కావాలి

సూర్యాపేట నియోజకవర్గ ప్రజల పక్షాన కోరుతున్న

60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు కనెక్టింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలి

నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట బ్యూరో చీఫ్ నవంబర్ 6 నంది పత్రిక సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ కన్వెన్షన్ హాల్లో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్, నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామెల్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, మాజీ డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రీతమ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు."సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించే బాధ్యత మనందరిపై ఉంది. మన పార్టీకి చెందిన, మన కుటుంబాలకు చెందిన ప్రతి అర్హతగల పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి. సూర్యాపేట జిల్లా నుంచి అత్యధిక మెజారిటీ రావాలి" అని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడం నిస్సందేహమని పేర్కొంటూ, 1994 నుంచి 2004 వరకు తెలుగుదేశం పార్టీ, 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ, 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నాయని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి దీర్ఘకాల భవిష్యత్తు ఉందని, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లపాటు కొనసాగుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.మనందరి ప్రియతమ నాయకుడు దామన్న కుమారుడు సర్వోత్తమ్. కాంగ్రెస్ రక్తం, కాంగ్రెస్ కుటుంబం నుంచి వచ్చిన సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి" అని ఆయన అన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్క పిలుపుతో ఇంత పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. "మీ అందరూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలి. ఈ ఎన్నికను మీ ఎన్నికగా భావించి పనిచేయాలి. పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో మీ వాయిస్‌గా నేను నిలుస్తాను" అని హామీ ఇచ్చారు.196 మండలాల్లో తిరిగి ప్రతి పట్టభద్రుడిని కలిసే ఓపిక, శక్తి ఈ సర్వోత్తముడికి ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సూర్యాపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే లైన్ ఏర్పాటు అంశాన్ని ప్రస్తావిస్తూ, సూర్యాపేట పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలంటే రైల్వే లైన్ అత్యవసరమని అన్నారు.అలాగే 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు కనెక్టింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూర్యాపేట నియోజకవర్గ ప్రజల పక్షాన కోరారు.చివరగా, "మీ దామన్న బిడ్డను, మీ సర్వోత్తముడిని భారీ మెజారిటీతో గెలిపించాలని" పట్టభద్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విస్తృత ఏర్పాట్లు

నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు

19,885 మంది పోలీసులతో మూడు అంచెల భద్రత

సున్నిత ప్రాంతాల్లో సీసీటీవీలు, డ్రోన్లు, బాడీ వోర్న్ కెమెరాలతో నిఘా



విజయవాడ బ్యూరో చీఫ్, నవంబర్ 6 నంది పత్రిక: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండవ సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు 07.11.2026న ఉదయం 8.00 గంటలకు ప్రారంభం కానుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 365 లెక్కింపు కేంద్రాల్లో సుమారు 9,062 లెక్కింపు బల్లలపై ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఇందుకోసం 11,002 మంది లెక్కింపు పర్యవేక్షకులు, 28,692 మంది లెక్కింపు సహాయకులు, ఇతర సిబ్బందిని నియమించారని ఎన్నికల కమిషనర్ పునేఠా తెలిపారు. ఈ ఎన్నికల్లో 77 జడ్పిటి సీలు, 2,051 ఎంపీటీసీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 577 ఎంపీటీసీలు 7,707 ఎంపీటీసీలకు 05.11.2026న పోలింగ్ నిర్వహించారని, మొత్తం పోలింగ్ శాతం 70.72గా నమోదైందని ఆయన తెలిపారు. గత 2021 ఎన్నికల పోలింగ్ శాతం 60.91తో పోలిస్తే 9.81 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించారు.బూత్ క్యాప్చరింగ్, బ్యాలెట్ పెట్టెల ధ్వంసం వంటి ఘటనల నేపథ్యంలో అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లోని ఏడు పోలింగ్ కేంద్రాల్లో 06.11.2026న రీపోలింగ్ నిర్వహించేందుకు ఆదేశించామని ఈ మేరకు ఆయా జిల్లాల్లో పోలింగ్ ప్రక్రియ కూడా సజావుగా ముగిసిందని తెలిపారు. ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం బ్యాలెట్ పెట్టెల్లోని జడ్పిటిసి ఎంపీటీసీ బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారని తెలిపారు. మొత్తం లెక్కింపు బల్లల్లో 50 శాతం జడ్పిటిసి లకు, మిగిలిన 50 శాతం ఎంపీటీసీ కు కేటాయించారని, ప్రతి బల్లకు ఒక్కో రౌండ్‌లో 1,000 బ్యాలెట్ పత్రాలను లెక్కింపు కోసం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు భద్రత, సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశామని, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు భారీ పోలీసు బందోబస్తు..... రాష్ట్ర పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నవంబర్ 5వ తేదీన నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రేపు జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి వెల్లడించారు.కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రాష్ట్రవ్యాప్తంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన మొత్తం 365 కౌంటింగ్ కేంద్రాల్లో 19,885 మంది పోలీసు సిబ్బందితో మూడు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బందోబస్తు విధుల్లో భాగంగా.....

డీఎస్పీలు, అడిషనల్ ఎస్పీలు 135 మంది
ఇన్స్పెక్టర్లు 572 మంది
సబ్‌ఇన్స్పెక్టర్లు 1,412 మంది
అడిషనల్ సబ్‌ఇన్స్పెక్టర్ల నుంచి పోలీసు కానిస్టేబుళ్ల వరకు 14,877 మంది
హోమ్ గార్డ్ లు 2889 మంది

మొత్తం 19,885 మంది పోలీసులతో కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఐజీ తెలిపారు. అదేవిధంగా సున్నితమైన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ సర్వెలెన్స్‌తో పాటు పోలీసు సిబ్బంది ధరించే బాడీ వోర్న్ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు.కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని, ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఐజీ బి. రాజకుమారి కోరారు.

జిల్లాలో జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల ఏర్పాటు పూర్తి చేశాం జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి





ఏలూరు, బ్యూరో చీఫ్ నవంబర్, 6 నంది పత్రిక: జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఏలూరు సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 27 జడ్పీటీసీ స్థానాలు, 454 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఒక జడ్పీటీసీ, 13 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవంగా ఎంపికయ్యాయయన్నారు. 26 జడ్పీటీసీ లు, 441 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయని , వాటికి ఈనెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏలూరు డివిజన్ కి సంబంధించి మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్లను ఏలూరులో సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలోనూ, జంగారెడ్డిగూడెం మండలానికి సంబంధించి జంగారెడ్డిగూడెంలో నోవా ఇంజనీరింగ్ కాలేజీలో, నూజివీడు డివిజన్ కి సంబంధించి నూజివీడులో సారధి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తారన్నారు. శుక్రవారం జిల్లాలో 4 జడ్పీటీసీ, 140 ఎంపిటిసి స్థానాలకు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. ద్వారకాతిరుమల, ఉంగుటూరు, ఏలూరు రురల్, కైకలూరు, ముదినేపల్లి, భీమడోలు, పెదవేగి మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమం సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో, పెదపాడు, నిడమర్రు, కలిదిండి, దెందులూరు, మండవల్లి, కామవరపుకోట మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సర్ సి.ఆర్.రెడ్డి , పాలిటెక్నిక్ కళాశాలలో, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, టి. నర్సాపురం, జీలుగుమిల్లి, పోలవరం, బుట్టాయిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమం జంగారెడ్డిగూడెంలో నోవా ఇంజనీరింగ్ కాలేజీలోని, అగిరిపల్లి , చాట్రాయి, ముసునూరు, నూజివీడు, చింతలపూడి, లింగపాలెం మండలాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమం నూజివీడులోని సారధి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణమోహన్, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.-



ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సునీల్ నాయక్



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 6 నంది పత్రిక ఆళ్లగడ్డ సామాజిక ఆరోగ్యకేంద్రంను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సునీల్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంబంధించిన ఓపీ పలు రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా కడప జిల్లా అన్నమయ్య జిల్లా, నంద్యాల జిల్లాలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ ఆస్పత్రి విషయానికొస్తే ఇక్కడ గైనకాలజిస్ట్ డాక్టర్ లేని విషయాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సూపర్నెంట్ శబరిస్, డాక్టర్ చంద్రశేఖర్ దస్తగిరి రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ టూ గుంతకల్ బస్ సర్వీస్ పునరుద్ధరన

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 6 నంది పత్రిక ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో నుండి 50 సంవత్సరముల నుండి ఆళ్లగడ్డ నుండి గుంతకల్ కు ప్రతిరోజు సర్వీస్ నడుస్తుండేది ఇటీవల ఆ బస్సు సర్వీసును రద్దు చేశారు ఈ సందర్భంగా అఖిల భారత ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ ఈ పనగండ్ల శ్రీనివాస్ యాదవ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ ఆర్టీసీ ఆర్ఎం ఆళ్లగడ్డ ఆర్టీసీ డిఎం బస్సు సర్వీస్ గురించి వారి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు . ఆళ్లగడ్డ నుండి గుంతకల్లుకు ఈ బస్సు సర్వీసు ద్వారా నిత్యం వందలాది మంది విద్యార్థులు వ్యాపారస్తులు తదితరులు ప్రయాణం చేసేవారని ఈసారి రద్దు కావడంతో అందరూ ఇబ్బందులు ఎదుర్కున్నారని విద్యార్థులందరూ తన దృష్టికి తేవడంతో తను కూడా మంత్రి ,ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారుల దృష్టికి దృష్టికి తీసుకుపోవడం జరిగిందని, స్పందించిన రాష్ట్ర మంత్రి ఈ బస్సు సర్వీస్ గురించి తప్పకుండా పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడం ఇచ్చారని హామీ మేరకు శుక్రవారం నాడు ఆళ్లగడ్డ గుంతకల్ బస్సు సర్వీసును మధ్యాహ్నం సర్వీసు పునర్దరించారు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆర్టీసీ ఎండి కోణార్క్ శశిధర్ ఈడి ఆర్ఎం ఆళ్లగడ్డ డిపో మేనేజర్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి శ్రీనివాస్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు బస్సు సర్వీసు పునరుద్ధరణతో ప్రయాణికులు వ్యాపారస్తులు విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు



అనధికార బాణసంచా దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం

జిల్లా కలెక్టర్ వేట్రి సెల్వి



ఏలూరు, బ్యూరో చీఫ్ నవంబర్, 6 నంది పత్రిక : అనధికార బాణాసంచా దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయదారులు అనుమతులు , భద్రతా నిబంధనలు, తదితర అంశాలపై జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శుక్రవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి బాణాసంచా ప్రమాదాలు సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా విక్రయ దుకాణా దారులు, నిల్వ దారులు తప్పనిసరిగా లైసెన్స్ లు పొందాలని, అనధికార విక్రయ, నిల్వ దారులపై కేసులు నమోదు చేయాలన్నారు. బాణాసంచా దుకాణాల దగ్గర అగ్నిప్రమాద నిరోధక వస్తువులు ఇసుక, నీరు, వంటివి తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ప్రతీ దుకాణాదారు తన లైసెన్స్ ను తప్పనిసరిగా దుకాణాల ముందు ప్రదర్శించాలన్నారు. బాణాసంచా అనధికార నిల్వలపై తహసీల్దార్, ఎంపిడిఓ, పోలీసు అధికారులు వారి పరిధిలో ఉమ్మడి తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరూ ప్రమాదరహిత దీపావళిని జరుపుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ అనధికార బాణాసంచా విక్రయదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. బాణాసంచా దుకాణాల వద్ద లైసెన్స్ లు పరిశీలించాలని, గ్రామంలో బాణాసంచా అక్రమ నిల్వ, విక్రయదారులు నియంత్రించాలన్నారు. జిల్లాలో దీపావళి సమయంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అక్రమ నిల్వ, విక్రయదారులపై నిఘా పెట్టాలన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, అసిస్టెంట్ కలెక్టర్ సిహెచ్. శ్రావణ్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ లు లక్ష్మీప్రసన్న, రమణ, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల్లోనూ అద్భుతమైన ప్రతిభ దాగిఉంది

-సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ అందిద్దాం

-ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివే విద్యార్థులు అద్భుత ఫలితాలు

-విద్యార్థుల భవిష్యత్తుకు మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా బాటలు వేస్తున్నాం

-ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



పభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి సరైన ప్రోత్సాహం, నాణ్యమైన శిక్షణ అందిస్తే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు దీటుగా అద్భుతమైన ఫలితా లు సాధిస్తారని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న పయనీర్ (PIONEER)కార్యక్రమం ద్వారా ప్రతి యేడాది వంద మంది విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించి, వైద్య, ఇంజి నీరింగ్‌తో పాటు పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశాలు పొం దడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యా ల యంలో శుక్రవారం పయనీర్ (PIONEER) కార్యక్రమం ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం, సర్టిఫికెట్ల పంపిణీ చేశా రు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల విద్యా ర్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో మహ బూబ్‌నగర్ ఫస్ట్ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి సంవత్సరం వంద మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందే స్థాయికి చేరుకోవడం పయనీర్ (PIONEER) కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన వాగ్దేవి, ప్రతిభ, ఋషి జూనియర్ కళా శాలల యాజమాన్యాలకు, ప్రిన్సిపాళ్లకు, అధ్యాపకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కళాశాలల అధ్యాపకులను కేటా యించి, నెలల తరబడి ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక కోచిం గ్ అందించడం అభినందనీయమన్నారు. ఈ సహకారం వల్లే విద్యా ర్థులకు మెరుగైన శిక్షణ అందించగలిగామని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులను అధిగమిస్తూ కష్టపడి చదివారని, కళాశాల సమ యం ముగిసిన తర్వాత కూడా అదనంగా రెండు గంటల పాటు శిక్షణ పొందారని గుర్తుచేశారు. వారి కృషి, అధ్యాపకుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం కలిసి మంచి ఫలితాలు సాధ్యం అయిందని తెలిపారు.ప్రస్తుతం విద్యార్థులు వైద్య, ఇంజినీరింగ్, నర్సింగ్, అగ్రికల్చర్ , వెటర్నరీ, బయోటెక్నాలజీ తదితర ప్రొఫెషనల్, సాంకేతిక కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారని చెప్పారు. నగరంలో టాస్క్ (TASK) ద్వారా కూడా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అంది స్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలను మరో పదేళ్ల పాటు కొనసాగిస్తే వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం సాధించిన విజయమే అంతిమ లక్ష్యం కాదని, ఇది భవిష్యత్తుకు తొలి అడుగు మాత్రమేనని ఆయన విద్యార్థులకు సూచించారు. తాము ఎంచుకున్న కోర్సులను పూర్తిస్థాయి ఏకాగ్రతతో చదువుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత చదువులు అభ్యసించే మూడు, నాలుగేళ్ల కాలం విద్యార్థుల జీవితంలో ఎంతో విలువైనదని, ఈ సమయంలో ఇతర ఆకర్ష ణలకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. కేవలం డిగ్రీలు పొందడమే కాకుండా, ఆయా కోర్సుల్లోని విషయ పరిజ్ఞా నాన్ని లోతుగా అర్థం చేసుకుని, నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, చదువు చెప్పిన అధ్యాపకులకు, చదువుకున్న కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ విజయాలను, సర్టిఫికెట్లను, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లతో దిగిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఇవి భవిష్యత్తులో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని చెప్పారు. ప్రతి కుటుంబంలోని బిడ్డ ఉన్నత విద్యను అభ్యసించి, స్వశక్తితో నిలబడి గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నదే తమ లక్ష్యమని యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు దాతలు, విద్యాసంస్థల యాజ మాన్యాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పయనీర్ (PIONEER) ప్రత్యేక శిక్షణ ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డీఐఈఓ చిలుక రమణి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ కౌసర్ జహాన్, బాలుర జూనియర్ కళా శాల ప్రిన్సి పాల్ అలీ ముద్దీన్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకట్ రెడ్డి, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, రిషి జూని యర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, కార్పొరేటర్లు అనుప ఆంజనేయులు, ప్రశాంత్ , సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల నాగరాజు, , జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, నాయకులు మైత్రి యాదయ్య , తుప్పలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గాలి కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్?



-పొగ తాగకపోయినా క్యాన్సర్ వచ్చే కారణం?

-వయసు పెరగటంతో కణాల్లో క్యాన్సర్ మార్పులు?

-మెడికల్ సైన్స్ ప్రపంచం లో ఇదొక కొత్త శకం?

-తాజా పరిశోధనలతో మారిన తీరు?

-ఆరోగ్యకర కణాలపై క్యానర్స్ ప్రభావం?

-మనిషి వెంట్రుక కంటే సన్నగా ఉండే కణాలు?

గాలి కాలుష్యం క్యాన్సర్‌కు కారణమవుతుందని తాజా పరిశోధనలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది పొగ తాగనప్పటికీ ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చనిపోవడానికి కారణం ఇదేనని తెలిసింది.

-వయసు పెరగటంతో కణాల్లో క్యాన్సర్ మార్పులు?

వయసు పెరిగే కొద్దీ మన శరీర కణాల్లో క్యాన్సర్‌కు కారణమయ్యే మార్పులు జరుగుతుంటాయి. ఇది సహజమే. కానీ అవి మామూలుగా అయితే నిద్రాణంగా ఉంటాయి. కానీ గాలి కాలుష్యం ఊపిరితిత్తుల్లో ఉండే ఇలాంటి కణాలను నిద్ర లేపుతోంది. తద్వారా అవి పెరిగి గడ్డలు ఏర్పడుతున్నాయని లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్ బృందం తెలిపింది.

-మెడికల్ సైన్స్ ప్రపంచం లో ఇదొక కొత్త శకం?

మెడికల్ సైన్స్ ప్రపంచంలో ఇదొక కొత్త శకమని ఈ బృందానికి నాయకత్వం వహించిన ప్రొఫెసర్ చార్లెస్ స్వాంటన్ అన్నారు. తద్వారా ఇప్పుడు క్యానర్స్ నివారణ కోసం మందులు తయారు చేయడం మరింత సులభంగా మారుతుందని చెబుతున్నారు.

-ఆరోగ్యకర కణాలపై క్యానర్స్ ప్రభావం?

సాధారణంగా క్యానర్స్‌లో ఆరోగ్యకరంగా ఉండే కణాలపై ప్రభావం పడుతుంది. కణాల డీఎన్ఏలో అధిక స్థాయిలో మార్పులు చోటు చేసుకుంటూ ఉన్నప్పుడు, ఒకానొక స్థాయికి చేరిన తరువాత అది క్యానర్స్‌గా మారుతుంది. ఇప్పటి వరకు క్యాన్సర్‌ను ఇలాగే అర్థం చేసుకుంటూ వస్తున్నారు.

-తాజా పరిశోధనలతో మారిన తీరు?

పొగ తాగని వారికి కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ ఎందుకు వస్తోంది? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఈ పరిశోధన చేపట్టారు. 2020లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 18 లక్షల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో చనిపోయినట్లు డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో అత్యధిక మరణాలకు కారణం పొగ తాగటమే.

కానీ ఇటీవల కాలంలో పొగ తాగని వారిలోనూ ఊపిరితిత్తుల క్యానర్స్ పెరుగుతోంది. బ్రిటన్‌లో ప్రతి 10 మందిలో ఒకరు గాలి కాలుష్యం వల్లే చనిపోతున్నారు.

భారత్‌లోనూ 2019లో గాలి కాలుష్యం వల్ల 16 లక్షల మంది చనిపోయినట్లు ది లాన్సెట్ కమిషన్ రిపోర్ట్ వెల్లడించింది

-మనిషి వెంట్రుక కంటే సన్నగా ఉండే కణాలు?

మనిషి వెంట్రుక కంటే కూడా సన్నగా ఉండే పీఎం 2.5 ధూళి కణాలపై ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్ బృందం దృష్టి పెట్టింది. జంతువులు, మనుషుల మీద చేసిన అనేక పరిశోధనల్లో భాగంగా బయటపడ్డ విషయాలు

గాలి కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నమోదయ్యే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం పొగతాగడం కాదు.

పీఎం 2.5 ధూళి కణాలు మనలోకి వెళ్లినప్పుడు ఊపిరితిత్తుల్లో ఇంటర్‌ల్యుకిన్-1-బీటా అనే సైటోకీన్ విడుదల అవుతుంది.

దాంతో ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి తద్వారా కలిగే డ్యామేజ్‌ను నివారించేందుకు ఊపిరితిత్తుల్లోని కణాలను అది యాక్టివేట్ చేస్తుంది.

50 ఏళ్ల వ్యక్తులను తీసుకుంటే వారిలోని ప్రతి 6 లక్షల కణాల్లో ఒక కణం, క్యాన్సర్ కారక మ్యూటేషన్లను కలిగి ఉంటుంది.

కానీ ఈ కణాలు సాధారణంగా నిద్రాణంగా ఉంటాయి. ఇంటర్‌ల్యుకిన్-1-బీటా సైటోకీన్స్ వల్ల ఆ కణాలు యాక్టివేట్ కావడం వల్ల గడ్డలు ఏర్పడతాయి. పరిశోధనలో భాగంగా గాలి కాలుష్యం వల్ల ఎలుకల్లో క్యాన్సర్ రాకుండా మందులతో శాస్త్రవేత్తలు అడ్డుకోగలిగారు. ఇంటర్‌ల్యుకిన్-1-బీటా సైటోకీన్స్ విడుదల కావడానికి జరిగే అలారమ్ సిగ్నల్‌ను వారు ఆపగలిగారు.

ఎప్పుడూ పొగ తాగని వారు తమకు ఎందుకు క్యాన్సర్ వచ్చిందే అర్థం చేసుకోలేక పోతారు. ఇప్పుడు ఈ పరిశోధన వల్ల ఆ రహస్యం తెలిసింది. ఇది ఎంతో ముఖ్యమైన పరిణామం. ఎందుకంటే ప్రపంచ జనాభాలో 99శాతం గాలి కాలుష్యం ఎక్కువగా



ఉండే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన ప్రమాణాల కంటే కూడా గాలి కాలుష్యం ఎక్కువగా ఉంది అని క్రిక్ పరిశోధకుల్లో ఒకరైన డాక్టర్ ఎమిలీయా లిమ్ అన్నారు.

కణాల్లో గడ్డలు ఎలా ఏర్పడతాయో మరింత లోతుగా తెలుసుకునేందుకు ఈ పరిశోధన ఉపయోగపడుతోంది

గాలి కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించే వారు క్యాన్సర్ రాకుండా ఉండేందుకు పిల్స్ వేసుకునే రోజులు కూడా రావొచ్చు. గుండె జబ్బులకు అందించే చికిత్సలో ఇప్పటికే డాక్టర్లు ఇంటర్‌ల్యుకిన్-1-బీటా డ్రగ్‌ను డాక్టర్లు పరిశీలించారు. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ఆ డ్రగ్ అడ్డుకోవడం వారిని ఆశ్చర్యపరిచింది.

పొగ తాగడం క్యాన్సర్‌కు దారి తీసే విధానం మీద మనం మరొక సారి దృష్టి సారించాలని ప్రొఫెసర్ స్వాటన్ అన్నారు. పొగాకులోని రసాయనలు కణాల్లోని డీఎన్ఏను డ్యామేజ్ చేస్తున్నాయా? లేక పొగ కూడా నష్టం చేస్తోందా? అనేది తెలుసుకోవాలని ఆయన చెప్పారు.

కణాల్లో డీఎన్ఏ పరివర్తనం చెందడం వల్ల మాత్రమే క్యాన్సర్ రాదని, అందుకు ఇతర కారణాలు కూడా ఉంటాయని 1947లో ఐజాక్ బెరిన్‌బ్లమ్ అనే సైంటిస్ట్ ప్రతిపాదించారు. అది నేటికి నిజమని తేలింది.

ఆయన 75 ఏళ్ల కిందటే ఈ విషయాన్ని గుర్తించారు. కానీ దాన్ని ఎవరూ పట్టించుకోలేదని డాక్టర్ లిమ్ పత్రికా ప్రతినిధులతో అన్నారు.



ఎల్-నీనో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో ఆరుతడి పంటలు సాగు చేయాలి: వ్యవసాయ అధికారులు





రానున్న యాసంగి సీజన్‌లో ఎల్-నీనో ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికా రులు సూచి ంచారు. నీటి లభ్యతను బట్టి వరికి బదు లుగా తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంట లను ఎంచుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించు కొని మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. రాజంపేట మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామ ంలో శుక్రవారం పొలంబడి క్షేత్ర దినోత్సవం, ఖేతి బచావో అభియాన్ కార్యక్ర ామాలను నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఎల్-నీనో ప్రభావాలు, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై చూపే ప్రభావం, రైతులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఆత్మ ఉప సంచాలకులు ఎస్. మహిత మాట్లాడుతూ, రానున్న యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. పశుపోషక రైతులు వి.బి.-జి. రామ్ జి పథకం కింద ఒక ఎకరం వరకు పశుగ్రాసం సాగు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. అపర్ణ మాట్లాడుతూ, ప్రొద్దుతిరుగుడు, కుసుమ, వేరుశనగ, శనగ, జొన్న, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ఆరుతడి పంటలను నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధి కారుల సలహాలు పాటిస్తూ బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను అవలం బించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల వ్యవసాయ అధికారి జోష్ణ ప్రియదర్శిని, కామారెడ్డి వ్యవసాయ అధికారి ఎం. పవన్ కుమార్, ఆత్మ బీటీఎం నవీన్ కుమార్, శివాయిపల్లి గ్రామ సర్పంచ్ బక్కి సంధ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు ఆనందరావు, రవీందర్, జంగంపల్లి సొసైటీ సీఈఓ రమేష్, ఏపీవో రాజారెడ్డి, ఏఈవో బాలకిషన్, రైతులు గురువారెడ్డి, రాజిరెడ్డి, విట్టల్ రెడ్డి, గంగారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

2020 తర్వాత ఇదే అతిపెద్ద పతనం.. కుప్పకూలిన అమెరికా మార్కెట్లు.. కారణాలివే..!



అమెరికా స్టాక్ మార్కెట్లలో భారీ పతనం నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంపై పెట్టుబడులు, వాటి నుంచి ఆశించిన లాభాలపై ఆందోళనలు మదుపర్లను కలవరపెట్టాయి. దీంతో టెక్నాలజీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ముఖ్యంగా నాస్‌డాక్ సూచీ భారీగా పడిపోయింది. 2020లో కరోనా సంక్షోభం తర్వాత ఇంతటి పతనం ఇదే తొలిసారి. అమెరికాలో నెలకొన్న ప్రభావం ఆసియా మార్కెట్లకూ పాకింది. గురువారం ట్రేడింగ్‌లో నాస్‌డాక్-100 సూచీ 6 శాతానికి పైగా పతనమైంది. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 4.4 శాతం నష్టపోయింది. చిప్ కంపెనీల షేర్లను ప్రతిబింబించే ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ సూచీ ఏకంగా 12 శాతం పడిపోయింది. డోజోన్స్‌లోని మొత్తం 30 కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఉన్న ఎన్విడియా షేరు 9 శాతానికి పైగా పడిపోయింది. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు ఆ కంపెనీకి వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్న టెక్నాలజీ సంస్థల భవిష్యత్తుపై మదుపర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. డేటా సెంటర్ల నిర్మాణానికి వందల బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన స్థాయిలో ఆదాయం వస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది.

అతడు లోన్ ఎగ్గొడితే.. మీరు కట్టాల్సిందేనా? గ్యారంటీ సంతకం చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోండి!

స్నేహితుడో, బంధువో బ్యాంకు లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు అర్హతలు సరిపోక మీ సాయం కోరవచ్చు. గ్యారంటీగా సంతకం చేయాలని అడగవచ్చు. వారి మీద నమ్మకంతో చాలామంది వెంటనే అంగీకరిస్తుంటారు. కానీ ఈ నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎందుకంటే రుణానికి హామీదారుగా సంతకం చేయడం అంటే కేవలం స్నేహితుడికి సాయం చేయడం మాత్రమే కాదు.. అతడు లోన్ వాయిదాలు చెల్లించకపోతే ఆ బాధ్యతను మీరూ స్వీకరించడమే. భారత్‌లో రుణ హామీ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, రుణగ్రహీత చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకు మిమ్మల్ని కూడా బాధ్యులుగా చేయవచ్చు.ఏమీ సేవింగ్స్‌కూ ముప్పు రుణగ్రహీత వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యాంకు బకాయి మొత్తాన్ని మీ నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిణామం మీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసర అవసరాల కోసం దాచుకున్న డబ్బు, భవిష్యత్తు ఖర్చుల కోసం కూడబెట్టిన సొమ్ము కూడా లోన్ చెల్లింపులకు వినియోగించాల్సి రావచ్చు. బకాయిలు అలాగే ఉంటే బ్యాంకు చట్టపరమైన చర్యలకూ దిగవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మీ ఆస్తులకూ ముప్పు ఏర్పడవచ్చు. మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినొచ్చు మీరు తీసుకోని లోన్ కారణంగా మీ క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రధాన రుణగ్రహీత వాయిదాలు సకాలంలో చెల్లించకపోయినా, లోన్ ఎగవేసినా ఆ వివరాలు క్రెడిట్ సమాచార సంస్థలకు చేరే అవకాశం ఉంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్ తగ్గవచ్చు. భవిష్యత్తులో వ్యక్తిగత



రుణం, గృహ రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు మీ క్రెడిట్ హిస్టరీని పరిశీలిస్తాయి. అప్పుడు మీరు ఇప్పటివరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినా, హామీ ఇచ్చిన లోన్ ప్రతికూలతలు మీపై ప్రభావం చూపవచ్చు.

ట్రావెల్స్ వ్యాపారులకు టయోటా గుడ్‌న్యూస్.. ఇన్నోవా క్రిస్టా లిమో వచ్చేసింది!

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత మార్కెట్లోకి కొత్త ఇన్నోవా క్రిస్టా లిమో వేరియంట్‌ను తీసుకొచ్చింది. ప్రధానంగా టాక్సీ, ట్రావెల్స్ సంస్థలు, ఇతర వాణిజ్య వాహన నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని దీన్ని రూపొందించింది. ఏడు సీట్ల వెర్షన్ ధరను రూ.19.95 లక్షలుగా, ఎనిమిది సీట్ల వెర్షన్ ధరను రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. ఇవి ఎక్స్‌షోరూమ్ ధరలు. ఇన్నోవా క్రిస్టా లిమోను ప్రత్యేకంగా జీఎక్స్-ఎస్ఎల్ఎఫ్ గ్రేడ్‌లో అందిస్తోంది. సాధారణ ఇన్నోవాతో పోలిస్తే ఇంజిన్, గేర్‌బాక్స్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ సీట్లను కూడా అందిస్తోంది. రెండో వరుసలో వ్యక్తిగత సీటింగ్‌కు ప్రాధాన్యమిచ్చే వారు ఏడు సీట్ల వెర్షన్‌ను ఎంచుకోవచ్చు. అదనంగా మరో ప్రయాణికుడికి చోటు కల్పించేలా ఎనిమిది సీట్ల వెర్షన్‌ను రూపొందించింది. ఈ వాహనంలో 2.4 లీటర్ల నాలుగు సిలిండర్ల డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. దీనికి మాన్యువల్ గేర్‌బాక్స్‌ను జత చేశారు. సాధారణ ఇన్నోవా క్రిస్టా గరిష్ఠంగా లీటరుకు



15 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ ధ్రువీకరించింది. సుదూర ప్రయాణాలు, తరచూ ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య అవసరాలకు ఇది అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. కొనుగోలుదారులకు మూడేళ్లు లేదా లక్ష కిలోమీటర్ల వరకు ప్రామాణిక వారంటీ లభిస్తుంది. అదనపు మొత్తంతో ఐదేళ్లు లేదా 2.20 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీని పొడిగించుకోవచ్చు. ఏడేళ్ల వరకు ఫైనాన్స్ సదుపాయాలు, తక్కువ ఈఎంఐ పథకాలు, త్వరిత సర్వీసింగ్, 24 గంటల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సదుపాయాలను కూడా టయోటా అందిస్తోంది.

రెండో వన్డేకు వర్షం ముప్పు.. మరోసారి యంగ్ పేసర్లపై టీమిండియా ఆశలు

ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో గెలిచిన భారత జట్టు, ఇప్పుడు రెండో వన్డేకు సిద్ధమైంది. వెల్లింగ్‌టన్‌లోని హెన్రీ స్టేడియంలో శనివారం జరిగే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను మరోసారి దెబ్బతీసి, సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించాలని పట్టుదలగా ఉంది. అనుభవం లేని భారత పేస్ దళం తొలి వన్డేలో అంచనాలకు మించి రాణించింది. రేపటి మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. సిరీస్ ప్రారంభానికి ముందు భారత బౌలింగ్ విభాగంపై కొన్ని సందేహాలు వ్యక్తమైనప్పటికీ, తొలి మ్యాచ్‌లో యువ పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్, అన్షుల్ కంబోజ్, తమ సత్తా చాటారు. వర్షం కారణంగా కుదించిన ఆ మ్యాచ్‌లో వీరు క్రమశిక్షణతో బౌలింగ్ చేసి కివీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. ముఖ్యంగా, అర్ష్‌దీప్ సింగ్ ఎక్కువ వికెట్లు తీసినప్పటికీ, అన్షుల్ కంబోజ్ తన పది ఓవర్లలో 46 డాట్ బాల్స్ వేసి అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు. టెస్ట్ మ్యాచ్ లెంగ్త్‌లో బంతులు వేస్తూ, స్వింగ్ రాబడుతూ కివీస్ బ్యాటర్లకు పెద్ద సవాల్ విసిరాడు. కోచ్ గౌతమ్ గంభీర్ వ్యూహాల్లో భాగంగా నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం సత్ఫలితాలనిచ్చింది. మరోవైపు, భారత బ్యాటింగ్‌లో కొన్ని ఆందోళనలు ఉన్నాయి. వెస్టిండీస్‌పై పరుగుల వరద పారించి న్యూజిలాండ్‌లో అడుగుపెట్టిన కెప్టెన్ రోహిత్ శర్మ, తొలి మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. అతను ఈ మ్యాచ్‌లో శుభారంభం అందించాలని జట్టు ఆశిస్తోంది. విరాట్ కోహ్లీ (74) అద్భుతమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, ఇతర బ్యాటర్లు ముఖ్యంగా షార్ట్ బాల్స్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నారు. శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ షార్ట్ బాల్స్‌కు తడబడటం స్పష్టంగా కనిపించింది. ఈ బలహీనతను వారు త్వరగా అధిగమించాల్సి ఉంది. తొలి వన్డేలో భారత బౌలర్లు విసిరిన అదనపు బౌన్స్‌ను ఎదుర్కోవడంలో తమ బ్యాటర్లు విఫలమయ్యారని న్యూజిలాండ్ కెప్టెన్



మిచెల్ సాంట్నర్ అంగీకరించాడు. దీనికి తోడు, ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో తలకు గాయం కావడంతో కీలక బ్యాటర్ డెవాన్ కాన్వే మిగిలిన సిరీస్‌కు దూరమవడం వారికి పెద్ద ఎదురుదెబ్బ. ఈ మ్యాచ్‌కు వాతావరణం కూడా పెద్ద సవాలుగా మారింది. శుక్రవారం వెల్లింగ్‌టన్‌లో చిరుజల్లులు పడటంతో ఇరు జట్లు తమ ట్రైనింగ్ ప్రణాళికలను మార్చుకున్నాయి. న్యూజిలాండ్ జట్టు ఇండోర్ ఫెసిలిటీస్‌లో ప్రాక్టీస్ చేయగా, భారత జట్టు తమ ప్రాక్టీస్‌ను పూర్తిగా రద్దు చేసుకుంది. మ్యాచ్ రోజున కూడా వర్షం పడే అవకాశం 60% వరకు ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇది మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

సోపర్స్

జీవితం క్రికెట్ కంటే పెద్దది.. భార్య క్యాన్సర్ పోరాటం నా జీవితాన్ని మార్చేసింది: కివీస్ బౌలర్



న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ బ్లెయిర్ టిక్నర్ తన జీవితంలోని అత్యంత కఠినమైన దశ గురించి, క్రికెట్‌పై తన దృక్పథం ఎలా మారిపోయిందనే విషయంపై భావోద్వేగంగా స్పందించాడు. తన భార్య సారా, ఈ ఏడాది ఏప్రిల్‌లో లుకేమియా (ఒక రకమైన బ్లడ్ క్యాన్సర్) బారిన పడిందని, ఎనిమిది నెలల పాటు చికిత్స తీసుకుని కోలుకుందని వెల్లడించాడు. ఈ క్లిష్ట సమయంలో తాను పొందిన అనుభవం జీవితంపై, ఆటపై తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపాడు.భారత్‌తో రెండో వన్డేకు ముందు వెల్లింగ్టన్‌లో మీడియాతో టిక్నర్ మాట్లాడుతూ.. "నా జీవితంలో చాలా ఒడిదొడుకులున్నాయి. ఈ కష్టకాలంలో నా భార్య సారా, నా కుటుంబం అండగా నిలవడం గొప్ప విషయం. ఇప్పుడు నేను మళ్లీ నా క్రికెట్‌ను ఆస్వాదించడం మొదలుపెట్టాను. నా కెరీర్ ప్రారంభంలో చాలా ఒత్తిడికి గురయ్యేవాడిని. ఆ తర్వాత నా భార్య క్యాన్సర్ చికిత్స సమయంలో చాలా కష్టపడ్డాను. ఇప్పుడు ఆ దశను దాటి వచ్చాక, సరదాగా క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నాను. అదే నేను ఇప్పుడు చేస్తున్న పని" అని వివరించాడు.ఈ కష్టకాలం తనకు ఒక ముఖ్యమైన పాఠం నేర్పిందని టిక్నర్ అన్నాడు. "క్రికెట్ నా కెరీర్‌లో ముఖ్యమైన భాగమే, కానీ అదే నా సర్వస్వం కాదు. జీవితం అంతకంటే చాలా పెద్దది. ఆట ముగిశాక నా కూతురు కోసం, నా భార్య కోసం ఇంటికి వెళ్లడం కంటే సంతోషం మరొకటి లేదు. అలా వెళ్లగలుగుతున్నందుకు నేను చాలా అదృష్టవంతుడిని. అందుకే ఇప్పుడు క్రికెట్ ప్రాధాన్యం కాస్త తగ్గింది" అని పేర్కొన్నాడు.

మోదీతో సూర్యకుమార్ యాదవ్ భేటీ.. 'రామ్, సరయూ' అంటూ ప్రధాని ట్వీట్



భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేడు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యాడు. ఈ భేటీకి సూర్య తన కుటుంబంతో సహా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. సూర్యకుమార్ పిల్లలతో ఆప్యాయంగా గడిపారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. సూర్యకుమార్ పిల్లల పేర్లను ప్రస్తావిస్తూ, దీపావళి పండుగ వాతావరణంలో రామ్, సరయూల రాకతో పండుగ వాతావరణం మరింత పవిత్రంగా, దివ్యంగా మారిందని పేర్కొన్నారు. ఈ భేటీలో ఈ ఏడాది ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్ సాధించిన చారిత్రక విజయంలో భాగంగా గెలుచుకున్న బంగారు పతకంతో సూర్యకుమార్ కనిపించాడు. ప్రధాని మోదీ ఆ పతకాన్ని చేతిలోకి తీసుకుని పరిశీలించి, సూర్యకు మార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ దృశ్యం టీమిండియా చారిత్రక విజయాన్ని గుర్తుచేసింది. టీ20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. 2022, 2023 సంవత్సరాల్లో వరుసగా 'ఐసీసీ మెన్స్ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును గెలుచుకున్నాడు. 2022 అక్టోబర్‌లో ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకున్న సూర్యకుమార్, 2023 జనవరిలో 910 పాయింట్లతో కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్‌ను సాధించాడు. సూర్యకుమార్ నాయకత్వంలోనే భారత్ 2025 టీ20 ఆసియా కప్, 2026 టీ20 ప్రపంచకప్‌లను కైవసం చేసుకుంది. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించడంలో కీలకపాత్ర పోషించాడు. అయితే, ఇంతటి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే అతనిపై వేటు పడటం గమనార్హం. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న యూకే పర్యటనకు ప్రకటించిన టీ20 జట్టులో సూర్యకుమార్‌కు చోటు దక్కలేదు. ఇటీవల కాలంలో సూర్య బ్యాటింగ్ ఫామ్ కాస్త తగ్గడమే ఇందుకు కారణమని సమాచారం

చిరంజీవి 'కాకా'పై పుకార్లకు చెక్.. సంక్రాంతికి రిలీజ్ పక్కా: కోన వెంకట్

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కాకా' విడుదలపై గత కొద్దిరోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ప్రముఖ రచయిత కోన వెంకట్ తనదైన శైలిలో తెరదించారు. సినిమా సంక్రాంతికి రావడం లేదంటూ వస్తున్న వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ ఘాటైన పోస్ట్ చేశారు.

"'కాకా' సినిమాపై వస్తున్న అన్ని పుకార్లకు, నిరాధార కథనాలకు ఇక సెలవు. మిమ్మల్ని నిరాశపరుస్తున్నందుకు క్షమించండి, కానీ మేము జనవరి 13న ల్యాండ్ అవుతున్నాం. సంక్రాంతికి 'కాకా' వస్తున్నాడు, అసలైన పండగ తెస్తున్నాడు" అని కోన వెంకట్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ఒక్క ప్రకటనతో సినిమా విడుదల తేదీపై ఉన్న అనుమానాలకు ఆయన పూర్తిస్థాయిలో చెక్ పెట్టారు.

చిరంజీవి హీరోగా దర్శకుడు బాబీ సారథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిత్రబృందం ఒకేసారి చిత్రీకరణ, డబ్బింగ్ పనులను సమాంతరంగా జరుపుతూ సినిమాను వేగంగా పూర్తి చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను కూడా పంచుకుని, పనులు ఎంత వేగంగా సాగుతున్నాయో తెలియజేసింది. వచ్చే ఏడాది సంక్రాంతి బరి హోరాహోరీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వెంకటేశ్, కల్యాణ్ రామ్ నటిస్తున్న చిత్రాన్ని అనిల్ రావిపూడి దర్శకత్వంలో జనవరి 12న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు సూపర్ స్టార్ రజినీకాంత్ 'ధర్మన్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు కూడా ఇదే పండక్కి పోటీ పడనున్నాయి. ఈ నేపథ్యంలో 'కాకా' రాకను చిత్రబృందం ధృవీకరించడం ఇండస్ట్రీలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



'సీన్' – మూవీ రివ్యూ!



సూర్య ఈ మధ్య కాలంలో చేసిన సినిమాలు భారీ విజయాలను అందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆయన మరో యాక్షన్ కామెడీ సినిమాను చేశాడు. ఆ సినిమా పేరే 'సీన్'. మలయాళంలో దర్శకుడిగా రచయితగా మంచి పేరు తెచ్చుకున్న జిత్తూ మాధవన్ ఈ సినిమాను తెరకెక్కించాడు. 'రోమాంచమ్' .. 'ఆవేశం' వంటి భారీ విజయాలను అందించిన ఆయన నుంచి వచ్చిన సినిమా ఇది. నజ్రియా నజీమ్ .. నెస్లెన్ కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లలో విడుదలైంది. ప్రేమ్ రాజ్ (సూర్య) ఒక పోలీస్ ఆఫీసర్. ఎలాంటి క్లిష్టమైన కేసులనైనా చాకచక్యంగా పరిష్కరించడం ఆయన ప్రత్యేకత. డిపార్టుమెంటులో చాలామంది ఆయనతో కలిసి పనిచేయడానికి ఆసక్తిని చూపుతుంటారు. 'విక్టర్' (టోవినో థామస్) అనే ఒక 'పెర్ఫ్యూమ్ కిల్లర్'ను చట్టానికి పట్టించిన ఘనత ప్రేమ్ రాజ్ కి ఉంటుంది. జైల్లో శిక్షను అనుభవిస్తున్న విక్టర్, ఇప్పుడు ప్రేమ్ రాజ్ పై కోపంతో ఉంటాడు. ఈ నేపథ్యంలోనే తన జాబ్ కి రిజైన్ చేయాలని ప్రేమ్ రాజ్ నిర్ణయించుకుంటాడు. అతని కంటి చూపు ఎప్పటికప్పుడు తగ్గిపోతూ ఉండటమే అందుకు కారణమని తెలుసుకుని పై అధికారులు షాక్ అవుతారు. ఈ నేపథ్యంలోనే సిటీలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. హంతకుడు ఎవరు? ఎందుకు హత్యలు చేస్తున్నాడు? అనేది అర్థం కాక పోలీసులు తలలు పట్టుకుంటారు. పోలీసులు పడుతున్న అవస్థలను చాటుగా గమనిస్తూ, ఈశ్వర్ (నెస్లెన్) ఎంజాయ్ చేస్తుంటాడు. అతను తన తల్లితో కలిసి హత్యలకు ప్లాన్ చేస్తుంటాడు. ఈ కేసును తానే సాల్వ్ చేయాలని ప్రేమ్ రాజ్ నిర్ణయించుకుంటాడు. అందుకోసం తన అసిస్టెంట్ గా 'మాయ' (నజ్రియా)ను నియమించుకుంటాడు. ప్రేమ్ రాజ్ తండ్రి గతంలో ఫోరెన్సిక్ డిపార్టుమెంటులో పనిచేసి ఉంటాడు. కాకపోతే ప్రస్తుతం అతను మెమరీ లాస్ తో ఇబ్బందిపడుతూ ఉంటాడు. ఇక ప్రేమ్ రాజ్ తల్లి నేరస్థుల స్వభావంపై అధ్యయనం చేసి ఉంటుంది. కాకపోతే ఆమె కూడా మద్యానికి బానిసై తన వృత్తికి దూరంగా ఉంటుంది. కంటిచూపు లేని ప్రేమ్ రాజ్ తన పేరెంట్స్ .. మాయ సాయంతో హంతకుడిని ఎలా పట్టుకుంటాడు? ఆ ప్రయత్నంలో ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంటాడు? అనేది మిగతా కథ. ఒక పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా సూర్య ఇంతవరకూ చాలానే సినిమాలు చేశాడు. పోలీస్ ఆఫీసర్ గా తెరపై ఆయన ఎంతలా విజృంభిస్తాడనేది అందరికీ తెలిసిందే. ఈ సినిమాలోనూ అదే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాడు. కాకపోతే ఆయనకీ కంటి చూపు ఉండదు. కంటిచూపు కోల్పోయిన ఒక పోలీస్ ఆఫీసర్, ఒక కిల్లర్ ను ఎలా వెంటాడుతాడు? ఎలా పట్టుకుంటాడు? అనే అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. ఈశ్వర్ తన తండ్రిని చంపి పూర్చడంతోనే ఈ కథ మొదలవుతుంది. అతను తన తన తండ్రిని ఎందుకు చంపేసి ఉంటాడు? అనే ఒక సందేహం ఆడియన్స్ ను వెంటాడుతూ ఉంటుంది. ఇక మరో వైపున పోలీస్ ఆఫీసర్ ప్రేమ్ రాజ్ తనదైన స్టైల్లో కేసులను డీల్ చేస్తూ వెళుతుంటాడు. పోలీస్ ఆఫీసర్ .. హంతకుడు ఇద్దరూ ఎక్కడ ఏ సందర్భంలో ఎదురుపడతారు? అనే ఒక కుతూహలం ప్రేక్షకులను అలా వెయిట్ చేయిస్తూ ఉంటుంది. చూపులేని ఒక పోలీస్ ఆఫీసర్ .. హంతకుడిగా మారిన ఒక తెలివైన కుర్రాడు మధ్య నడిచే దాగుడు మూతలు ఆసక్తికరంగానే ఉంటాయి. అలాగే చూపులేని పోలీస్ ఆఫీసర్ కి మాయ తాను చూపై ముందుకు నడిపించే సన్నివేశాలు కూడా ఇంట్రెస్టింగ్ గానే అనిపిస్తాయి. పోలీస్ ఆఫీసర్ కి చూపు ఉందో లేదో తెలుసుకోవడం కోసం వెళ్లిన హంతకుడు మాయ కంట్లో పడిపోవడం .. హంతకుడి తల్లిని వెంబడించడం .. ప్రేమ్ రాజ్ ను వెతుక్కుంటూ హంతకుడు నేరుగా అతని ఇంటికి రావడం .. వంటి సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. ఓపెనింగ్ సీన్ తోనే ఉత్కంఠను రేకెత్తించి సప్పటికీ, ఆ తరువాత కథనం చల్లబడుతూ .. చెప్పబడుతూ సాగుతుంది. ప్రీ క్లైమాక్స్ కి ముందు నుంచే కథ కాస్త పుంజుకుంటుంది. క్లైమాక్స్ దిశగా పరుగెడుతున్న సమయంలోనే రక్తి కట్టిస్తుంది. అప్పటివరకూ పోలీస్ ఆఫీసర్స్ అరుపులు .. కేకలతో ఆడియన్స్ కి కాస్త అసహనం తప్పదనే చెప్పాలి. కామెడీ కోసం అనుకున్నాడో ఏమో గానీ, ఆరంభంలో సూర్య .. లాల్ పాత్రలు గట్టిగా అరుస్తూ ఆడియన్స్ ను చిరాకుపెడతాయి. ఇక సూర్య తల్లిదండ్రుల పాత్రల ద్వారా కామెడీని కాస్త గట్టిగానే పిండాలనే ఉద్దేశంతో దర్శకుడు ప్రయత్నించినట్టు కనిపిస్తుంది. కాకపోతే ఆ ప్రయత్నం వికటిం చిందనే చెప్పాలి. ఈ పాత్రలతో డిజైన్ చేసిన సన్నివేశాలు నవ్వించలేకపోగా ఇబ్బంది పెడతాయి. ఇక విక్టర్ పాత్రను సెకండ్ పార్ట్ కోసం వదిలేశారని అనుకోవాలి. సూర్య నజ్రియా .. నెస్లెన్ నటన ఆకట్టుకుంటుంది. వినీత్ అగస్టీన్ ఫొటోగ్రఫీ .. సు శీన్ శ్యామ్ నేపథ్య సంగీతం .. అజ్మల్ సాబూ ఎడిటింగ్ ఫరవాలేదు. లవ్ .. రొమాన్స్ ..

'రామాయణ'పై రకుల్ ప్రీత్ సింగ్ భావోద్వేగం

బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన 'రామాయణ' చిత్రం నవంబర్ 6న విడుదలై మంచి ప్రేక్షకాదరణ పొందుతోంది. ఈ సినిమాలో కీలకమైన శూర్పణఖ పాత్రను నటి రకుల్ ప్రీత్ సింగ్ పోషించారు. తాజాగా ఈ పాత్రలో నటించడంపై తన అనుభవాలను, సంతో షాన్ని ఆమె సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "శూర్పణఖ పాత్ర పోషిం చడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన ప్రయాణం. భారతీయ సంస్కృతిలో భాగ మైన రామాయణాన్ని ఇంత భారీ స్థాయిలో వెండితెరపై ఆవిష్కరించడం అద్భుతమైన అనుభూతినిచ్చింది" అని రకుల్ పేర్కొ న్నారు. ఈ గొప్ప ఆలోచనను కార్య రూపంలో పెట్టిన దర్శకుడు నితీశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రపం చానికి భారత్ నుంచి ఓ అద్భుతమైన చిత్రాన్ని అందించాలన్న వారి తపన తనకు స్ఫూర్తిని చ్చిందని వివరించారు. ఈ సినిమాలో తన సహనటులైన రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, రవిదూబే, కాజల్ అగర్వాల్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తానికి ఆమె కృతజ్ఞతలు తెలియ జేశారు. ముఖ్యంగా, రోజూ నాలుగు గంటల పాటు శ్రమించి తనను శూర్ప ణఖగా సిద్ధం చేసిన కాస్ట్యూమ్ బృందాల కృషిని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావిం చారు. ఇది కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, ఒక భారతీయురాలిగా తాను ఎంతో గర్వపడే క్షణం అని రకుల్ తన పోస్టులో ఉద్వేగంగా రాసుకొచ్చారు.



ప్రభుత్వ ఒత్తిడితో కథ మార్చారా? 'మాతృభూమి'పై సల్మాన్ ఖాన్ క్లారిటీ

తన తాజా చిత్రం 'మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్' కథను ప్రభుత్వ ఒత్తిడితో మార్చారన్న ప్రచారాన్ని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఖండించారు. సెన్సార్ బోర్డు అభ్యంతరాల వల్ల సినిమా నిలిచిపోయిందన్న వార్తల్లోనూ నిజం లేదని స్పష్టం చేశారు. శుక్రవారం ముంబైలో నిర్వహించిన సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన ఈ విషయాలపై స్పందించారు.ప్రభుత్వం చెప్పడంతో కథను తిరిగి రాశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని సల్మాన్ అన్నారు. "ఇదంతా అబద్ధం. మా సినిమా సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితుల చుట్టూ తిరుగుతుంది. ఇరు దేశాల వైపు ఉన్న సైనికుల జీవితాలను ఇందులో చూపించాం. ఇందులో ఎవరి పట్లా ప్రతికూలత లేదు. పరిస్థితులే ప్రతికూలంగా ఉంటాయి" అని వివరించారు.దర్శకుడు అపూర్వ లఖియా తొలుత మరో కథాంశంతో సినిమా రూపొందించారని సల్మాన్ వెల్లడించారు. ఈ చిత్రం మొదట 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో తెరకెక్కింది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ ఈ కథకు ప్రేరణగా నిలిచింది. అయితే ప్రస్తుత రూపంలో సైనికుల అనుభవాలు, వారి కుటుంబాల భావోద్వేగాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సల్మాన్ తెలిపారు. సైనికులకు దేశమే మొదటి ప్రాధాన్యమని, వ్యక్తిగతంగా ఒకరిపై ఒకరికి సానుకూల భావాలు ఉన్నా పరిస్థితులు ఎదురైనప్పుడు దేశం కోసమే నిలబడతారని చెప్పారు. ఇరు వైపులా సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కావాల్సి ఉండగా, వాయిదా పడింది. తాజా ప్రకటన ప్రకారం డిసెంబరు 4న థియేటర్లలోకి రానుంది. సల్మాన్ ఖాన్ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో చిత్రాంగద సింగ్, ముఖేశ్ రిషి, అంకుర్ భాటియా, జేన్ షా, అభిలాష్ చౌదరి తదితరులు నటిస్తున్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com